www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -83 మంగళవారం 7 జులై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## పర్యాటకంకు పెద్దపీట

**తారామతి బారాదరి, దుర్గం చెరువుల అభివృద్ధి**

**మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌ల ఆధునికీకరణ**

**ఎకో టూరిజం పార్కుల అభివృద్ధికి చర్యలు**

**పర్యాటకంపై సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశాలు**



**హైదరాబాద్,జులై 6:(ప్రజావినికిడి):**
తారామతి బారాదరి, దుర్గం చెరువులను పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పర్యాటక కేంద్రాలను గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధికి అసవరమైన ప్రణాళికలు సిద్దం చేయాలన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పర్యాటకశాఖపై సీఎం సమిక్ష నిర్వహించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని.. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి **మిగతా 2లో...**



## యుద్ధోన్మాదులను చంపాల్సిందే

**ఖమేనీ అంత్యక్రియలకు**

**భారీగా తరలి వస్తున్న జనం**

**ట్రంప్, నెతన్యాహూలపై ప్రజాగ్రహం**

**టెహ్రాన్ :జులై 6(ప్రజావినికిడి):**
ఇరాన్ రాజధాని టెహ్రాన్ నగర వీధులు ప్రజా సందోహంతో కిక్కిరిసిపోయాయి. అమెరికా-ఇజ్రాయిల్ దాడులలో ప్రాణాలు కోల్పోయిన మాజీ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరైన**మిగతా 2లో...**

## ఐటీ పార్క్ నిర్మించాల్సిన చోట డంప్ యార్డా?

**సిద్ధాపూర్ జీవోను ఉపసంహరించుకోవాలి**

**లేదంటే బాధితుల పక్షాన ఉద్యమం**

**: మాజీమంత్రి హరీశ్‌రావు హెచ్చరిక**



**2లో.**

## జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

**కార్మికుల భద్రతకు ఎలాంటి రాజీ లేదు**

**ప్రాజెక్టు పూర్తితో 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు**

**ఆధునిక యంత్రాలతో పనులు వేగవంతం**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
దక్షిణ తెలంగాణ రైతుల దశాబ్దాల కల అయిన ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టును జూన్ 2028 నాటికి తప్పకుండా పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. **మిగతా 2లో...**



## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ నేటితో పూర్తి కావాలి

**పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించాలి**

**బిఎల్‌వోలు సక్రమంగా పనిచేసేలా చూడాలి**

**కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**హైదరాబాద్,జులై 6:(ప్రజావినికిడి):**
ఈ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నాటికి ఎట్టి పరిస్థితులలో పూర్తి చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి **మిగతా 2లో...**




## కడలిలో కల్లోలం

**ఒకరు మృతి, ఆరుగురి గల్లంతు..**

**విశాఖలో కొనసాగుతున్న గాలింపు**





**అనకాపల్లి తీరంలో పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి**

**నేవీ, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో సహాయక చర్యలు**

**సమాచారం కోసం మత్స్యకారుల కుటుంబసభ్యుల ఆందోళన**

**గాలింపు ముమ్మరం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం**

**విశాఖజులై 6:(ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలో సోమవారం రెండు వేర్వేరు విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. అనకాపల్లి జిల్లాలో పడవ బోల్తా పడిన ఘటనలో ఒక మత్స్యకారుడు మృతి చెందగా, విశాఖ తీరంలో గల్లంతైన**మిగతా 2లో...**

## కాళేశ్వరంపై పాపం కడుక్కోండి

**అసెంబ్లీకి వచ్చి నిజాలు చెప్పండి**

**లక్ష కోట్లు ఎలా,ఎందుకు ఖర్చు పెట్టారో చెప్పాలి**

**పేదలకు ఎందుకు ఇళ్లు నిర్మించలేదో చెప్పండి**

**కెసిఆర్‌కు సవాల్ చేసిన మంత్రి పొంగులేటి**

సిద్దిపేట,**జులై 6:(ప్రజావినికిడి):**
గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి లక్షల కోట్ల రూపాయల నిధులు వెచ్చించదని కానీ, పేదవాడికి ఒక సొంత ఇల్లు కట్టించి ఇవ్వడానికి మాత్రం వారికి మనసు రాలేదని రాష్ట్ర రెవెన్యూ, **మిగతా 2లో...**



## ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

ఇండోనేషియాకు చేరుకున్న ప్రధాని మోడీ

గగనతలంలో యుద్ధవిమానాల ఎస్కార్ట్

ఘనంగా స్వాగతం పలికిన ఇండోనేసియా అధ్యక్షుడు



**న్యూఢిల్లీ,జులై 6:(ప్రజావినికిడి):**
ప్రధాని నరేంద్రమోదీ ఇండోనేసియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని ఆ దేశం ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం జకార్తా గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. ప్రధాని మోదీ విమానాశ్రయానికి చేరుకోగానే ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. తాను జకార్తా చేరుకున్నానని.. ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికిన తీరు తనను ఎంతగానో కదిలించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పెంచే **మిగతా 2లో...**

## ఏపీ సమగ్రాభివృద్ధికి త్రైపాక్షిక వ్యూహం

**విశాఖలో 'బే సిటీ'.. అమరావతి, తిరుపతిలో స్పోర్ట్స్ సిటీలు: అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం**


**విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళిక**

**6 నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్ల మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ఆదేశం**

**మూడు రీజియన్లలో ప్రైవేట్ భాగస్వామ్యంతో స్పోర్ట్స్ సిటీల ఏర్పాటు**

**51.88 చ.కి.మీ. విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ' అభివృద్ధికి కార్యాచరణ**

**అమరావతి,జులై 6:(ప్రజావినికిడి):**
రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ఏర్పాటు చేసిన మూడు ఎకనామిక్ **మిగతా 2లో...**



# ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

**మొదటిపేజీ తరువాయి**

లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. ఇండోనేసియాలో పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని మోదీ జులై 8న ఆస్ట్రేలియా చేరుకుంటారు. జులై 9న అక్కడ జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పర్యటనకు బయలుదేరారు. జులై 6 నుంచి 11 వరకు కొనసాగనున్న ఈ ఆరు రోజుల పర్యటనలో ఆయా దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు మోదీ. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇండో-పసిఫిక్ ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై కీలకంగా చర్చించనున్నారు. అలాగే భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు ప్రముఖ వ్యాపారవేత్తలతోనూ సమావేశం కానున్నారు. పర్యటనకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఓ కీలక ప్రకటన విడుదల చేశారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలు భారత యాక్ట్ ఈస్ట్ పాలసీ, మహాసాగర్ విజన్‌కు మరింత బలం చేకూరుస్తాయని ఆయన తెలిపారు. స్వేచ్ఛాయుత, బహిరంగ, సమ్మిళిత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణంపై భారత్ నిబద్ధతను ఈ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జులై 6 నుంచి 8 వరకు ఇండోనేషియాలో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ప్రధానిగా నరేంద్ర మోదీ నాలుగోసారి ఇండోనేషియాలో పర్యటిస్తున్నారు. జకార్తాలో అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతోతో ప్రధాని మోదీ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించనున్నారు. అనంతరం భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు. అలాగే యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న యోగ్యకర్తలోని ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఇండోనేషియా పర్యటన అనంతరం జులై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. అలాగే ఆ దేశ గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ఇండియా-ఆస్ట్రేలియా సీఈఓల ఫోరంలో పాల్గొని ఇరు దేశాల ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. భారతీయ ప్రవాసులతోనూ ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఆస్ట్రేలియాపర్యటన అనంతరం జులై 10, 11 తేదీల్లో న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగనుంది. మరోవైపు దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌ను సందర్శిస్తున్న తొలి భారత ప్రధానమంత్రిగా మోదీ నిలవనున్నారు. ఆక్‌లాండ్‌లో ప్రధాని లక్సన్‌తో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ద్వైపాక్షిక సహకారం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. గత రెండేళ్లలో ఇరు దేశాల మధ్య ముఖ్యంగా వాణిజ్యం, రక్షణ రంగాల్లో నమోదైన పురోగతిని సమీక్షించ నున్నారు. అదే సమయంలో ప్రముఖ వ్యాపార, క్రీడా రంగాల ప్రముఖులతోనూ ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం కానున్నారు. ఆ తర్వాత భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు.

# జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

**మొదటిపేజీ తరువాయి**

అదే సమయంలో టన్నెల్ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. రోజున డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి, ఈ ప్రాజెక్టు కేవలం ఇంజినీరింగ్ నిర్మాణం మాత్రమే కాదని, దక్షిణ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షకు రూపం ఇవ్వడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం అవసరమైన నిధులు, భూసేకరణ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అనుమతులను వేగంగా పూర్తి చేసి పనులు నిరంతరాయంగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. టన్నెల్‌తో పాటు డిండి ప్రాజెక్టు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాన్ని ఒకే సమగ్ర ప్రాజెక్టుగా భావించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ పనులు పునఃప్రారంభించిన తర్వాత ఇప్పటికే అర కిలోమీటర్‌కు పైగా పురోగతి నమోదైందని తెలిపారు. దేవరకొండ వైపు నుంచి పనులు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని, శ్రీశైలం వైపు కూడా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సాగుతున్నాయని చెప్పారు. టన్నెల్ పనులను మరింత వేగవంతం చేసేందుకు మూడు అత్యాధునిక ఆర్మ్ బూమర్ యంత్రాలు ముంబై పోర్టుకు చేరాయని, ఈ నెలాఖరులో పనుల ప్రదేశానికి చేరుకుని నిర్మాణ వేగాన్ని మరింత పెంచనున్నాయని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు, 618 ఎ÷-లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు, అలాగే పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా అందుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుకు సవరించిన పరిపాలనా అనుమతి వ్యయం సుమారు రూ.12,718 కోట్లు అని తెలిపారు. పనుల వేగం ఎంత ముఖ్యమైనదైనా, కార్మికుల భద్రత దానికంటే ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. టన్నెల్ అంతటా తగిన లైటింగ్, సమర్థవంతమైన వెంటిలేషన్, సీనియర్ జియాలజిస్టులు, అథారిటీ ఇంజినీర్లు, నిపుణుల నిరంతర పర్యవేక్షణతో పనులు కొనసాగించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. న్నెల్ వద్ద పనిచేసే సిబ్బందిని ఇప్పటికే మూడింతలు పెంచినట్లు, అదనపు యంత్రాలు, ప్రత్యేక పరికరాలు, సాంకేతిక నిపుణులను సమీకరిస్తున్నట్లు తెలిపారు. యంత్రాల రవాణా, కస్టమ్స్ అనుమతులు, సాంకేతిక సిబ్బంది నియామకం వంటి అంశాల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిండి ప్రాజెక్టు, నక్కలగండి రిజర్వాయర్, పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, కాలువల నెట్‌వర్క్ పూర్తయితేనే ఎస్ఎల్‌బీసీ పూర్తి ప్రయోజనాలు రైతులకు అందుతాయని
మంత్రి తెలిపారు. భూసేకరణ పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసే పక్రియను వేగవంతం చేయాలని సూచించారు. హై లెవల్ కెనాల్, లో లెవల్ కెనాల్, ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం, కాలువల సామర్థ్య పెంపు పనులపైనా సమీక్ష నిర్వహించిన మంత్రి, అవసరమైన చోట కాలువలను విస్తరించి భవిష్యత్తులో అదనపు నీటి ప్రవాహాలను సురక్షితంగా మోయగల విధంగా రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. 'ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను జూన్?2028 నాటికి అన్ని విధాలుగా పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్టులు దక్షిణ తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా, ఎ÷-లోరైడ్ బాధిత ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించి ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ చూపిస్తాయి' అని అన్నారు. సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) వి. రమేష్ బాబు, ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐటీ పార్క్ నిర్మించాల్సిన చోట డంప్ యార్డా?

### సిద్దాపూర్ జీవోను ఉపసంహరించుకోవాలి

### లేదంటే బాధితుల పక్షాన ఉద్యమం

### : మాజీమంత్రి హరీశ్‌రావు హెచ్చరిక



**హైదరాబాద్‌జులై 6(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్‌లో డంప్ యార్డు ఏర్పాటు నిర్ణయంతో స్థానిక రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు అన్నారు. ఐటీ పార్క్ నిర్మించాల్సిన ప్రాంతంలో డంప్‌యార్డు పెట్టడం సరైంది కాదని చెప్పారు. సిద్దాపూర్‌లో డంప్ యార్డు జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లో బాధిత రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. డంప్ యార్డు వల్ల వారు ఏ విధంగా నష్టపోతున్నారో వివరించారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడాలనీ, న్యాయం జరిగేలా చూడాలని వారు ఆయన్ను కోరారు. రైతుల వినతిపై స్పందించిన హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. సిద్దాపూర్ గ్రామంలో 86 ఎకరాల్లో డంప్ యార్డు ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 641 తీసుకురావడం అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. పచ్చని వ్యవసాయ భూముల మధ్య, జనావాసాలకు సమీపంలో డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు నిదర్శనమని అన్నారు. ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. సిద్దాపూర్‌తోపాటు చుట్టుపక్కల ఉన్న దాదాపు 20 గ్రామాలు ఈ డంప్ యార్డు వల్ల తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గ్రామాల ప్రజలంతా పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. హైదరాబాద్ నగరానికి అవసరమైన కూరగాయలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకుంటున్న స్థలానికి ఆనుకుని ఉన్న 'గుట్ట చెరువు' నీటితోనే ఈ ప్రాంత రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారని చెప్పారు. ఇప్పుడు ఆ చెరువు పక్కనే డంప్ యార్డు పెడితే ఆ నీరు పూర్తిగా కలుషితమై, సాగు నీటితోపాటు తాగునీటికీ తీవ్ర ముప్పు వాటిల్లుతుందని అన్నారు. ఎంతో ప్రసిద్ధి చెందిన జహంగీర్ పీర్ (జేపీ) దర్గా కూడా ఇక్కడే ఉండటంతో, ఆ కాలుష్యం స్థానికులతోపాటు భక్తులకు కూడా శాపంగా మారడం ఖాయమని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంతంలో, డంప్ యార్డుకు కేటాయించిన సర్వే నెంబర్లు 252, 278, 361లో ఉన్న 334 ఎకరాల్లో ఐటీ పార్క్ నిర్మించాలని తాము ప్రణాళికలు రూపొందించామని గుర్తు చేశారు.అక్కడ ఐటీ పార్క్ వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని సంకల్పించామని అన్నారు. ఉపాధి కల్పించాల్సిన భూముల్లో కాంగ్రెస్ ప్రభుత్వం డంప్ యార్డు ఏర్పాటు చేసి స్థానిక ప్రజల బతుకులను చిదిమేయాలని చూడటం శోచనీయమని విమర్శించారు. యువత కు అవకాశాలు కల్పించాల్సిన చోట కాలుష్యాన్ని, రోగాలను ఇవ్వడమే ప్రజా పాలనా?అని ప్రశ్నించారు. ప్రభుత్వం డంప్ యార్డులను ఏర్పాటు చేయాల నుకుంటే ప్రజలకు ఏమాత్రం ఇబ్బంది కలగని చోట, జనావాసాలు, గ్రామాలు లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ఇలా పచ్చని పల్లెలను, పొలాలను, రైతులను ఆగమాగం చేయడం ఏమాత్రం తగదని హెచ్చరించారు.

# యుద్ధోన్మాదులను చంపాల్సిందే

**మొదటిపేజీ తరువాయి**

ప్రజానీకం కన్నీరుమున్నీరవుతున్నారు. కొందరైతే ఆగ్రహం పట్టలేక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూలను హతమార్చాలని డిమాండ్ చేశారు. ఉదయం ప్రార్థనలు ప్రారంభం కావడానికి ముందే ప్రజలు పెద్ద ఎత్తున గ్రాండ్ మొసల్లాకు చేరుకున్నారు. ఇరాన్ పతాకాలతో పాటు ప్రతీకారానికి చిహ్నంగా ఎర్ర జెండాలను, ఖమేనీ చిత్ర పటాలను పట్టుకొని అమెరికా, ఇజ్రాయిల్ దేశాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంత్యక్రియలు ప్రారంభమైన రోజుతో పోలిస్తే జనం తాకిడి చాలా ఎక్కువగా ఉంది. వాతావరణం ఉద్రేకపూరితంగా కన్పించింది.'ప్రపంచంలోనే అత్యంత నీచమైన వ్యక్తి ఇంకా ఎందుకు జీవించి ఉన్నాడు? ట్రంప్‌కు ఈ ప్రపంచం ఇక ఎంత మాత్రం మంచి ప్రదేశం కాదు. మన ఇమామ్‌ను చంపిన వ్యక్తిని మనం ఎందుకు చంపకూడదు? మనం అలా చేయకపోతే అవమానకరం అవుతుంది' అని మహమ్మద్ రసూలీ అనే కవి జనసమూహాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ అన్నారు. రసూలీ ప్రసంగిస్తున్నంత సేపూ ప్రజలు కరతాళధ్వనులతో తమ మద్దతు తెలియజేశారు. 'ట్రంప్‌ను చంపాల్సిందే' అని రాసి ఉన్న ప్లకార్డు ఓ వ్యక్తి చేతిలో కన్పించింది.అమెరికా-ఇజ్రాయిల్ సేనల దాడులు మొదలైన తర్వాత ఇరాన్ రాజకీయ, సైనిక నాయకత్వం బహిరంగంగా కలిసి కనిపించడం ఇదే మొదటిసారి. 'మీరు మనుషులను చంపగలరు. కానీ ఆదర్శాలను కాదు' అని అర్మేనియాలోని ఇరాన్ రాయబారి ఖలీల్ షిర్ఘోలామీ అన్నారు. పశ్చిమ దేశాలకు నాగరికత, చరిత్ర, గౌరవం లేవని మండిపడ్డారు. శత్రువులపై పగ, ఖమేనీ రక్తానికి ప్రతీకారం తీర్చుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మహమ్మద్ బఘేల్ జోల్గదర్ చెప్పారు. కాగా యుద్ధ సమయంలో ప్రజలకు దూరంగా ఉన్న పలువురు నేతలు, సైనికాధికారులు అంత్యక్రియలలో కనిపించారని 'ది గార్డియన్' పత్రిక తెలిపింది. ఖమేనీ కుమారులు ముస్తఫా, మసూద్, మెయిసామ్‌లు తండ్రి శవపేటిక పక్కనే నిలబడ్డారు. సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ మాత్రం హాజరు కాలేదు. భార్య అంత్యక్రియలకు కూడా ఆయన వెళ్లలేదు. ఖోమ్‌కు చెందిన 97 ఏండ్ల మతగురువు నేతృత్వంలో ప్రార్థనలు జరిగాయి. యుద్ధోన్మాదానికి బలైన 14 నెలల ఖమేనీ మనుమరాలి శవపేటికను చూసి జనం భోరున విలపించారు. ఖమేనీ జన్మస్థలమైన మషద్‌లోని ఇమామ్ రెజా మందిరంలో ఖననం చేయడానికి ముందు పార్థివ దేహాన్ని ఇరాన్, ఇరాక్ మీదుగా ఊరేగింపుగా తీసికెళతారు.ఖమేనీ అంత్యక్రియల ఊరేగింపులో పాల్గొనేందుకు ప్రజలు సోమవారం నల్లని దుస్తులు ధరించి భారీగా తరలి వచ్చారు. ఖమేనీ భౌతికకాయం ఉన్న శవపేటికతో పాటు ఆయన కుటుంబ సభ్యుల శవపేటికలను కూడా ఓ ట్రక్కుపై ఉంచారు. శవపేటికలను టెహ్రాన్ వీధుల మీదుగా మెహ్రాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలిస్తు న్నారు. ఈ ప్రయాణానికి 12 గంటలకు పైగా సమయం పడుతుంది. ఊరేగింపు సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున కవాతు జరిపారు.

# పర్యాటకంకు పెద్దపీట

**మొదటిపేజీ తరువాయి**

చేయాలన్నారు. అక్కడ వీరభద్ర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు యాదగిరిగుట్ట తరహాలో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని అటవీశాఖ భూములను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలన్నారు.గుర్రంగూడ ఎకో పార్కు తరహాలో నగరంలో మరిన్ని పార్కులను తీర్చిదిద్దాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలి. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకాధికారులను నియమించాలన్నారు. పురానాపూల్, హెరిటేజ్ బ్రిడ్జిలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి. ట్రాఫిక్‌ను మళ్లించి బ్రిడ్జిపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలి. డిసెంబర్‌లో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమిట్ ఏర్పాట్లు ప్రారంభించాలని సీఎం రేవంత్ దిశానిర్దేశర చేశారు.

# కడలిలో కల్లోలం

**మొదటిపేజీ తరువాయి**

ఆరుగురు మత్స్యకారుల కోసం రెండో రోజూ గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ రెండు సంఘటనలతో మత్స్యకార గ్రామాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.వివరాల్లోకి వెళితే.. అనకాపల్లి జిల్లా రేవుపోలవరం తీరంలో నలుగురు మత్స్యకారులతో వెళుతున్న పడవ అలల ఉద్ధృతికి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు సురక్షితంగా ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. చోడిపల్లి సింహాద్రి (రేవుపోలవరం వాసి) అనే మత్స్యకారుడు గల్లంతై మృతి చెందాడు. అతని మృతదేహం ఒడ్డుకు కొట్టుకువచ్చింది.మరోవైపు విశాఖ తీరంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం భారత నావికాదళం, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు సంయుక్తంగా ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. హెలికాప్టర్, ప్రత్యేక నౌక, రెస్క్యూ బోట్లతో గాలింపును కొనసాగిస్తున్నారు. ఈ ఘటనలో కార్గో షిప్ ద్వారా రక్షించబడిన కారి చిన్న అనే మత్స్యకారుడు (బోటు యజమాని) ఇచ్చిన సమాచారం ఆధారంగా సహాయక చర్యలు జరుగుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత మొదటి 72 గంటలు చాలా కీలకమని, మత్స్యకారులు ప్రాణాలతో దొరుకుతారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి, గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఐజీ గోపీనాథ్ జెట్టి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారడంతో, ఈ నెల 1న వేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. గల్లంతైన తమ వారి గురించి సరైన సమాచారం అందించడం లేదంటూ వారి కుటుంబసభ్యులు విశాఖలో ఆందోళన చేపట్టారు. దీంతో తీర ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# కాళేశ్వరంపై పాపం కడుక్కోండి

**మొదటిపేజీ తరువాయి**

గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది వాళ్లే, దాన్ని ఓపెన్ చేసింది వాళ్లే, చివరకు అది కూలిపోయింది కూడా వాళ్ల హయాంలోనేనని మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు వాళ్లే కాళేశ్వరం దగ్గరకు పోయి తామేదో చేశామంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.సిద్దిపేట జిల్లా ములుగులో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లపట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వివేక్
వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాజెక్టులో నీళ్లు నిల్వ ఉంచితే కింద ఉన్న ప్రాంతమంతా కొట్టుకుపోతుందని ఎన్‌డీఎస్ఏ హెచ్చరించినా, బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్న తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు కట్టినప్పుడు గత పాలకులకు చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే కాళేశ్వరానికి ఈ గతి పట్టేది కాదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దుయ్యబట్టారు. కేవలం అధికారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపడం ఆపాలని హితవు పలికారు. కాళేశ్వరం ప్రపంచంలోనే ఎనిమిదో వింత అన్న పెద్దమనిషి కేసీఆర్ ఇప్పటికైనా అసెంబ్లీకి రావాలి. కాళేశ్వరాన్ని ఎలా కట్టారో సమాధానం చెప్పి.. తాము చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని సవాల్ విసిరారు. వారు ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీ వేదికగా చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కేసీఆర్ సభకు వచ్చి కాళేశ్వరంపై పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే కాళేశ్వరం కట్టారని.. ఆ ప్రాజెక్టు పేరుతో నిధులు మెక్కారని ఎద్దేవా చేశారు. కానీ నిందలేమో తమ ప్రభుత్వంపై వేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. ప్రతిసారి కర్రు కాల్చి వాత పెడుతున్నారని హెచ్చరించారు. పేదోడి కష్టం తెలియని బీఆర్ఎస్ ప్రభుత్వానికి మాత్రం కాళేశ్వరం కట్టడానికి లక్ష కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. అధికారం కావాలనే దాహంతో తమ ప్రభుత్వంపై నిందలు మోపడం బీఆర్ఎస్ నేతలు ఆపాలని హితవు పలికారు. చిత్తశుద్ధితో సలహాలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీకి రావాలని కోరారు. ప్రపంచంలో ఉన్న ఏడు వింతలు కాదని.. ఎనిమిదో వింత కాళేశ్వరమని ఆనాడు చెప్పిన పెద్దమనిషి అసెంబ్లీకి రావాలని సూచించారు. కాళేశ్వరం ఎలా కట్టారో చెప్పాలని, కేసీఆర్ తెలంగాణకు చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అసంపూర్తిగా కట్టి మధ్యలోనే వదిలేశారని మంత్రి పొంగులేటి ఆరోపించారు. గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం వదిలేసిన ఆ అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అన్నింటినీ రిపేర్ చేసి త్వరలోనే పేదలకు అందిస్తామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తల తాకట్టు పెట్టి అయినా సరే, అర్హులైన ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చడమే తమ ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో 32 వేల పూరి గుడిసెలు ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. మొదటి విడతలో ఇవ్వలేక పోయిన వాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో ఇస్తామని.. వారికే మొదటి ప్రాధాన్యం కల్పిస్తామని వెల్లడించారు. ఏ పార్టీల్లోని లబ్దిదారులైనా.. పైరవీ లేకుండా చిత్తశుద్ధితో ఇళ్లను మంజూరు చేస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో సిద్దిపేట గజ్వేల్, సిరిసిల్ల, నియోజకవర్గాల్లో మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అత్యధికంగా కట్టుకున్నారని చెప్పారు. వేరే నియోజకవర్గాల్లో అరకొరగా 50, 60 ఇళ్లు కట్టి అసంపూర్తిగానే వదిలేశారని తెలిపారు. రెండోవిడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని వ్యాఖ్యానించారు. గతంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కూడా డబ్బులు ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయించామని చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న 500 ఇళ్లకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ నేటితో పూర్తి కావాలి

**మొదటిపేజీ తరువాయి**

జిల్లాలతో పాటు పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించి వందశాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. అదనపు సిఇఒ వాసం వెంకటేశ్వర్లు తో కలిసి సోమవారం ఎస్ఐఆర్ పక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమ పురోగతిపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో సూపర్ వైజర్ల ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఎక్కడైతే బిఎల్ఒలు బలహీనంగా ఉన్నారో వారిని గుర్తించి ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో వారికి సూపర్ వైజర్లు సహకరించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో స్థానికంగా వాలంటీర్లను గుర్తించి వారి ద్వారా పూరించేందుకు ఓటర్లకు సహకరించాలని సూచించారు. సంబంధిత సూపర్ వైజర్ల ఫోన్ నెంబర్లను మీడియా ద్వారా తెలియజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. హైదరబాద్లో ఇప్పటికే ప్రారంభమైన 16 హెల్ప్ డెస్క్ లతో పాటు అవసరమైన చోట అదనంగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. పూర్తయిన ఎన్యూమరేషన్ ఫారాలలో సదరు ఓటరు, బిఎల్ఒ సంతకాలు ఉండేలా చూడాలని దీంతో పాటు ఫోటోలు ఉండేలా చూడాలని సిఇఒ ఆదేశించారు. ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సర్ పక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలకు సంబంధించి డిజిటలైజేషన్ పక్రియను ప్రారంభించాలన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పక్రియను కూడా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వివిధ పోలింగ్ కేంద్రాలలో కాకుండా ఒకే పోలింగ్ కేంద్రంలో వారి పేర్లు ఉండేవిధంగా చూడాలన్నారు. ఆన్ లైన్ ద్వారా వచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను కూడా బిఎల్ఒలు సరి చూసు కోవాలని, ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో మరోసారి బిఎల్ఒలకు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. బిఎల్ఒలు తప్పనిసరిగా రాజకీయ పార్టీలతో సమావేశాలు జరిగేవిధంగా చూడాలని, సర్ పక్రియపై వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సిఇఒ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ ఎన్నికల అధికారి చారి, డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య, చిరంజీవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
మంగళవారం 7 జులై 2026

# కొందుర్గు మండల కేంద్రంలో సియంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి

### స్థానిక నాయకుల చేత లబ్ది దారులకు అందింప చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**కొందుర్గు,(ప్రజావినికిడి):**
కొందుర్గు మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన మన్మారి సురేందర్,సోమారంపహాడ్ గ్రామానికి చెందిన బోల యాదయ్యలకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో మంజూరైన సియంఆర్ఎఫ్ చెక్కులను కొందుర్గు మండల కేంద్రంలో లబ్ధిదారులకు స్థానిక నాయకుల చేత అందింపచేశారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్,మాజీ జడ్పిటిసి తనయుడు రామకృష్ణ,మాజీ పిఎసిస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి,ఉమేంత్యాల సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్ రెడ్డి,మహదేవ్ పూర్ సర్పంచ్ అనూషరవీందర్ రెడ్డి,విశ్వనాథ్పూర్ సర్పంచ్ శ్రీలత రాములు,గుంజల్ పహాడ్ సర్పంచ్ వెంకటేష్,మాజీ సర్పంచ్ ప్రేమ్ కుమార్,గోపాల్ నాయక్, నర్సిములు, నాయకులు దర్గారామచేంద్రయ్య, ఎ.యాదయ్య,డిప్యూటీ సర్పంచ్ రాజు,ఉదయ్ భాను,భాగాలరాములు,చిట్యల రవీందర్,కబీర్ శ్రీకాంత్,కబీర్ క్రిష్ణ,పిట్ట శేఖర్ యాదయ్య, సి.సతి రెడ్డి బోయ ప్రశాంత్ లతీఫ్ వెంకటయ్య,డిప్యూటీ సర్పంచ్ రాజు పామిడి నగేష్,పామిడి రమేష్,టేకులపల్లి బుడోని నర్సింలు పద్మారామ్ క్రిష్ణయ్య,బాలకిషయ్య తదితరులు పాల్గొన్నారు.

# జూలై 10న కేజీ టు పీజీ విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలకు వ్యతిరేకంగా, ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు జూలై 10న పిలుపునిచ్చిన కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌కు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని, ఈ బంద్ కు సంబందించిన గోడ పత్రికను హిమాయత్ నగర్ లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు,ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయడం, విద్యార్థుల సంఖ్య పేరుతో పాఠశాలలను మూసివేసే ప్రయత్నాలు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది,ఎంఈఓ, డీఈఓ తదితర కీలక పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల ప్రభుత్వ విద్య తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మరోవైపు పాఠశాలలు, ఇంటర్ కళాశాలలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో భవనాలు,తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఆటస్థలాలు వంటి మౌలిక సదుపాయాల కొరత విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సింది పోయి ప్రైవేట్, కార్పొరేట్




విద్యను ప్రోత్సహించే విధానాలను అమలు చేస్తోందన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు,డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులకు తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నా ప్రభుత్వం నియంత్రణలో విఫలమైందన్నారుప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థలకు తగిన నిధులు విడుదల చేసి నాణ్యమైన విద్య అందించాలని, ఎన్ఈపీ-2020 అమలుకు ముందు ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాలతో విస్తృత చర్చలు నిర్వహించాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తున్నదన్నారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు. ప్రభుత్వ విద్యను కాపాడడం,పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత, అందుబాటు విద్యను అందించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత.ఈ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకోకుండా ప్రజల ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు . అందువల్ల జూలై 10న జరిగే కేజీ టు పీజీ విద్యా సంస్థల బంద్‌ను విద్యార్థులు, యువజనులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపునిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ సాధ్యం..

### నేను సైతం 2.0" కార్యక్రమంలో 54 సీసీటీవీ కెమెరాల ప్రారంభం..

### ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య..

**నాగోల్,(ప్రజావినికిడి):**
మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణ,నేర పరిశోధనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు అత్యంత కీలకమని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య పేర్కొన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు చేపడుతున్న "నేను సైతం 2.0" కార్యక్రమంలో భాగంగా,నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టి అన్నారం డబుల్ బెడ్‌రూమ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన 54 సీసీటీవీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ, సీసీటీవీ కెమెరాలు నేరాల నివారణ, నేరస్థుల గుర్తింపు, నేరాల పరిశోధనలో కీలక ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు.ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ నివాస ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్, వాణిజ్య సంస్థలు సీసీటీవీ నిఘా





వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టి అన్నారం డబుల్ బెడ్‌రూమ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లోని నాలుగు బ్లాకుల నివాసితులు తమ సొంత వ్యయంతో 54 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు.ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని,పోలీసులకు ప్రజల సహకారం ఎంతో అవసరమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నాగోల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, ఎస్ఐ శివ నాగ ప్రసాద్,మాజీ కౌన్సిలర్ దేవిడి వేణుగోపాల్ రెడ్డి,



బ్లాక్ ఇన్‌చార్జ్‌లు రిజ్వాన్,భాస్కర్, దేవేందర్, మొహమ్మద్ ఖాతీజా బేగం తదితరులు పాల్గొన్నారు.

# 163,జాతీయ రహదారి పనులు సకాలంలో పూర్తి చెయ్యాలి

**వాజేడు,(ప్రజావినికిడి):**జాతీయ రహదారి పనులను నిర్లక్ష్యంగా చేపడుతున్న గుత్తేదారు పై చర్యలు తీసుకోని, సకాలంలో జాతీయ రహదారి పనులు పూర్తిచేయాలని కోరుతూ సోమవారం సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో 163,జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి మాట్లాడుతూ జగన్నాధపురం నుండి చెరుకూరు వరకు 11 కిలో మీటర్ల మేర 163 జాతీయ రహదారి విస్తరణ పనులను మొదలు పెట్టి 2 సంవత్సరాలు గడుస్తున్నా ఈ నాటికీ పూర్తి కాలేదని,రోడ్డు నిర్మాణం చేయటానికి అవసరం అయినా మనుషులు, యంత్రాలు సరిపడలేకపోవటం,గుత్తేదారు, నిర్మాణనికి తగిన శ్రద్ద చూపకపోవటం, తో సంవత్సరాలు పడుతుందని,జాతీయ రహదారి గుత్తేదారు ప్రముఖ రాష్ట్ర మంత్రి అనుచరులు అవటంతో అధికారుల పర్యవేక్షణలు లేకపోవడం తో ఇష్టారాజ్యంగా పనులు చేపట్టడం తో ప్రజలు రైతులు,వాహన దారులు తీవ్ర మైన ఇబ్బందులు




పడుతున్నారని అన్నారు.ఇసుక వాగు పై బ్రిడ్జి నిర్మాణం నత్త నడకన సాగుతుందని, కొత్త బ్రిడ్జి నిర్మాణం పేరుతో, సకాలంలో పూర్తి కాదని తెలిసిన ఉన్న బ్రిడ్జిని కూల్చి సరైన మాన్ పవర్ లేకుండా పనులు చేపట్టడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయని,అందువలన 9 గ్రామ పంచాయతీ లకు సంబంధించిన 25 గ్రామాలు సుమారు పదివేల మంది ప్రజలు రవాణా మార్గం లేక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతారని అన్నారు. వర్షాకాలం ఇసుక వాగు పూర్తిగా ముంపునకు గురవడంతో రైతులు, విద్యార్థులు ప్రయాణికులు సాధారణ ప్రజలు విద్య వైద్యం




వ్యవసాయానికి ఎరువులు కుటుంబ అవసరాల కొరకు సరుకులు అందక ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గుత్తేదారిపై చర్యలు తీసుకొని జాతీయ రహదారి పనులు ఇసుక వాగు పై బ్రిడ్జి పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో సిపిఎం పార్టీ మండల నాయకులు జేజ్జరి దామోదర్,గుగ్గిళ్ళ దేవయ్య, గౌరారపు చంద్రశేఖర్,పవన్ కుమారి,కుర్సం ప్రవీణ్,ఓనం కృష్ణ బాబు,కుర్సం శాంతకుమారి, నాగమణి కృష్ణమూర్తి తదితరలు పాల్గొన్నారు.

# కరాటే విద్యార్థులను అభినందించిన తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

### గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు మెడల్స్ అందజేత

### షాద్ నగర్ కు చెందిన యాదవ్ బుడోఖాన్ కరాటే క్లబ్ విద్యార్థుల ప్రతిభ



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్ నగర్ పట్టణంలోని ప్రముఖ కరాటే అకాడమీ యాదవ్ బుడోఖాన్ కరాటే క్లబ్ ఇంటర్నేషనల్ కు చెందిన కరాటే మాస్టర్లు అలాగే విద్యార్థులు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఇటీవలే యాదవ్ బుడోఖాన్ కరాటే క్లబ్ కు చెందిన విద్యార్థులు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ విజయాన్ని పురస్కరించుకొని వాటికి సంబంధించిన మెడల్స్ అలాగే సర్టిఫికెట్లను సోమవారం తన ఛాంబర్ లో కరాటే విద్యార్థులకు చైర్మన్ శివసేనరెడ్డి విద్యార్థులకు అందించడం జరిగింది.పాల్గొన్న విద్యార్థులకు అదేవిదంగా మాస్టర్లకు తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి అభినందించడం జరిగింది. అనంతరం శివసేనారెడ్డి మాట్లాడుతూ, కరాటే లో విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని చదువులో కూడా రాణించాలని తమ తల్లిదండ్రులకు మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యాదవ్ బుడోఖాన్ కరాటే క్లబ్ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ సాయినాథ్ యాదవ్,సీనియర్ మాస్టర్ గోపి వినయ్,హర్షిత విద్యార్థులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా బూత్ నెం.281ను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి..



**హయత్ నగర్,(ప్రజావినికిడి):**భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బూత్ నెం. 281, కమలానగర్ సంక్షేమ సంఘం భవనం నందు మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా అక్కడ కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచేసుకుని, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనది ప్రతి అర్హుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవాలి.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ బూత్ ఏజెంట్ గాండ్ల సందీప్,కాలనీ అధ్యక్షులు మదన్, కాలనీ ప్రధాన కార్యదర్శి సుబ్బా రావు,కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సంగ్రామ్,వెంకటేష్ గౌడ్,పుష్పాంజలి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల పై వీల్స్ ట్రాక్టర్ తిప్పితే కఠిన చర్యలు

**వాజేడు,జులై 7 (ప్రజావినికిడి):**
పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల ట్రాక్టర్ డ్రైవర్లకు, రైతులందరికీ ముఖ్య గమనిక రైతులు తమ తమ వీల్స్ ట్రాక్టర్స్ ను పొలం పనులకు ఉపయోగించి అలాగే మట్టితో బురదతో తారు రోడ్లపైకి వచ్చి రోడ్లపై మట్టి పడేస్తూ వెళ్తున్నారు దీనివలన రోడ్డుపై పడిన బంక మట్టి అంటుకుపోయి వర్షం పడినప్పుడు అట్టి రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహన దారులు జారిపడే ప్రమాదాలు ఉన్నందున వీల్స్ చక్రాలు తారు రోడ్డుపై వెళ్లడంతో రోడ్డు డ్యామేజ్ అవుతుందని అందువలన వీల్స్ ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు సంబంధిత రైతులు వారి ట్రాక్టర్ల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోగలరని లేనియేడల వారిపై చర్యలు తీసుకో బడతాయని పేరూరు ఎస్సై తెలిపారు.



# నిర్లక్ష్యంగా బిఎల్‌వోల వ్యవహారం

### ఎన్నికల సంఘానికి బిఆర్ఎస్ ఫిర్యాదు

**హైదరాబాద్,జూలై6(ప్రజావినికిడి):**
బీఎల్‌వోలు రాష్ట్ర వ్యాప్తంగా సక్రమంగా పని చేయటం లేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఎన్నికలసంఘాన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని వినోద్ కుమార్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్సీ ఎల్. రమణ, సోమా భరత్, కర్నె ప్రభాకర్, వై సతీష్ రెడ్డి, సుమిత్రానంద్ కలిశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్.ఐ.ఆర్ పక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున సీఈవోకు వినపతి పత్రం అందించామన్నారు. సర్ కోసం బీఆర్ఎస్ పార్టీ ఒక ప్రత్యేక కమిటీ వేసింది. ఈ కమిటీ బీఎల్‌వోలు, బీఎల్ఏలతో కలిసి పనిచేయటం కోసం వీళ్లని నియమించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా వినతులు మాకు వచ్చాయి. అవన్నీ సీఈవో సుదర్శన్ రెడ్డికి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫామ్ ఓటర్లకు ఇవ్వడం లేదు. చాలా మందికి ఇంకా ఫామ్ అందలేదన్నారు. 20 రోజుల సమయం మాత్రమే ఉంది. ఇంకా సమయం పెంచాలని సీఈవోను కోరినట్లు ఆయన వివరించారు. అలాగే కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఈ విషయాలు వెల్లడిస్తామని చెప్పారు.డూప్లికేట్ ఓట్లు విషయంలో సరైన చర్యలు తీసుకోవాలని కోరాం. ఇక్కడ అక్కడ రెండు ఓట్లు ఉన్నాయి. అలాంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చర్యలు తీసుకోలన్నారు. దీనిపై అవగాహన కల్పించాలి అని సూచించారు. అలాగే పేర్ల విషయంలో గందరగోళం ఉంది. వీటిపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని, బీఎల్‌వోలకు తగిన సూచనలు చేయాలన్నారు.

# ఓ ఆర్ ఆర్ పై ఘోర రోడ్డు ప్రమాదం..

## లారీని ఢీ కొట్టిన కారు -యువకుడు మృతి





**రాజేంద్ర నగర్,(ప్రజావినికిడి):** పెద్ద గోల్కొండ (ఓఆర్ ఆర్) ఔటర్ రింగ్ రోడ్డుపై రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా,శంషాబాద్ మండల పరిధిలోని గోల్కొండ అవుటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ప్రమాదం వివరాల్లోకెళ్తే జూలై 4వ తేదిన చల్ల రాఘవేంద్ర ప్రసాద్, చల్ల మనోహర్ హైదరాబాదులో ఉంటూ సాఫ్ట్వేర్ జాబ్ చేస్తున్నారు. ఐతే తన చెల్లె ఎంగేజ్మెంట్ ఉన్నదని చెల్ల మనోహర్,భవాని, కార్తికేయలు అందరితో కలిసి తన సొంత గ్రామమైన ఎరుపల్లికి కారులో ఏర్పల్లి గ్రామానికి వెళ్లి ఎంగేజ్మెంట్ అయిన తర్వాత కారులో రాఘవేంద్ర ప్రసాద్ డ్రైవింగ్ చేస్తుండగా మనోహర్ డ్రైవర్ పక్కన సిటు లో, భవాని,కార్తికేయ వెనకాల సీట్లో కూర్చొని వస్తుండగా మార్గమధ్యంలో జూలై 6న మధ్యరాత్రి 3 గంటల ప్రాంతంలో పెద్ద గోల్కొండ గ్రామ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్ ఎక్స్టెన్షన్ 15 వద్దకు రాగానే రాఘవేంద్ర ప్రసాద్ సెకండ్ లైన్ లో వెళ్తుండగా అతని అతని ముందు వెళ్తున్నటువంటి గుర్తు తెలియని లారీ డ్రైవర్ సడన్ గా స్లో అవుతుండడంతో రాఘవేంద్ర ప్రసాద్ కార్ స్పీడ్ కంట్రోల్ కాకపోవడం అట్టి గుర్తు తెలియని లారీని వెనకాల నుండి వేగంగా ఢీ కొట్టడంతో డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న చెల్లా మనోహర్ తల నుజు నుజ్జు అయి అక్కడి అక్కడే మృతి చెందాడని, డ్రైవింగ్ చేస్తున్నటువంటి రాఘవేంద్ర ప్రసాద్ భార్య భవాని ముఖానికి రక్తం గాయాలు కావడం పొట్టపై బాగాన పెద్ద గాయం తగిలడం కారు కూడ పూర్తిగా డామేజ్ కావడం జరిగిందన్నారు.ఈ విషయంపై పోలీస్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# ఘనంగా మాజీ ఎంపీపి నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు..

## హాజరైన షాద్ నగర్ ప్రముఖులు..







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**షాద్ నగర్ సీనియర్ కాంగ్రెస్ నేత,ఫరూక్ నగర్ మాజీ ఎంపీపి నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి.షాద్ నగర్ పట్నంలోని న్యూ సిటీ కాలనీలో ఆయన స్వగృహంలో జరిగిన జన్మదిన వేడుకలలో నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు మొదటగా కేక్ కట్ చేయగా ఆ తర్వాత ఆయన అభిమానులు మిత్రులు శ్రేయోభిలాషులు స్నేహితులు పెద్ద ఎత్తున వేడుకలకు హాజరై ఆయనను ఘనంగా సన్మానించారు. సీనియర్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ కేపీ,జర్నలిస్టులు శరత్,లక్కాకుల రమేష్ కుమార్, శివ కుమార్,టీజీ ఆర్ఎస్ఏ రాష్ట్ర నాయకులు ఎం. వెంకటరెడ్డి, విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేతలు విశ్వనాథం, మనోహర్ రెడ్డి, దేవి గ్రాండ్ అధినేత దయాకర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ అశోక్,రివాల్వర్ శేఖర్,సీతారాం, ముబారక్ అలీ ఖాన్, సీతారాములు, శారద నెహ్రూ, దర్శన్,అశోక్, జర్నలిస్టు శివకుమార్, సుదర్శన్, తులసిరామ్ అదేవిధంగా ప్రముఖులు న్యాయవాది గుండుబావి శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖర్జీ సేవలు నిరుపమానం

## దలైలామాతో అనుబంధం గుర్తు చేసుకున్న కిషన్ రెడ్డి

## హైడ్రా తీరుపై మరోమారు ఆగ్రహం



**హైదరాబాద్,జూలై6(ప్రజావినికిడి):**

శ్యామప్రసాద్ జయంతి, దలైలామా జన్మదినం సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. ముఖర్జీ సేవలను ఆయన కొనియాడారు. అలాగే దలైలామా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలలని ఆకాంక్షించారు. దలైలామాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి సర్కారుకు మజ్లిస్ పార్టీ అంటే భయమా, ప్రేమా లేక రెండూ ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కమిషన్ల కోసం ఆరాటపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఇందుకోసం సామాన్య ప్రజల జీవనోపాధిని బలిచేస్తోందని ఆరోపించారు. అదే సమయంలో మజ్లిస్ పార్టీ అగ్రనేతల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ ప్రభుత్వం ఎంత దూరమైనా వెళ్లేందుకు వెనుకాడటం లేదని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ సాగిస్తున్న పక్షపాత పాలనకు హైడ్రా చర్యలే ప్రత్యక్ష ఉదాహరణ అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సామాన్య ప్రజల ఇళ్లు, నిర్మాణాల విషయంలో మాత్రం మెరుపు వేగంతో నిర్ణయాలు తీసుకుంటూ, కఠినంగా బుల్డోజర్లతో వ్యవహరిస్తున్న ప్రభుత్వం.. ఒవైసీ కుటుంబానికి చెందిన బారిస్టర్ ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తోందని దుయ్యబట్టారు. సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్‌ను ఆక్రమించి ఈ క్యాంపస్ నిర్మించారనే ఆరోపణలపై తెలంగాణ హైకోర్టు పలుమార్లు జోక్యం చేసుకుని, ప్రభుత్వ జాప్యంపై చీవాట్లు పెట్టినా సర్కారు తీరు మారలేదన్నారు. హైడ్రా, విద్యాశాఖ సహా పలు శాఖల నుంచి కోర్టు వివరాలు కోరినా, సామాన్యులపై చూపించే తొందరపాటును ఫాతిమా కాలేజీ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మజ్లిస్‌ను యావత్ ముస్లిం సమాజానికి ఏకైక ప్రతినిధిగా భావిస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని కిషన్ రెడ్డి విమర్శించారు. హైడ్రా చర్యల వల్ల ఎంతోమంది పేద ముస్లింల ఇళ్లు కూలిపోయి, వారి జీవనోపాధి దెబ్బతిన్నప్పుడు మజ్లిస్ గానీ, కాంగ్రెస్ గానీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని గుర్తుచేశారు.

# అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే లక్ష్యంగా ముందుకు

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ -7.50 కోట్ల నిధులతో పాలమాకుల, చౌదర్ గూడ,కాచారం గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన





**రాజేంద్రనగర్,(ప్రజావినికిడి):** అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్టు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల పరిధిలో ఆయా గ్రామాల్లో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎచ్ఎం డిఏ) ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మండలంలో చౌదర్ గూడ, కాచారం, పాలమాకుల గ్రామాల్లో సోమవారం,సి సి, బిటి రోడ్డు నిర్మాణ పనులను అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్ లతో కలిసి సుమారు రూ.7.50 కోట్ల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే లక్ష్యంగా ముందుకు వెళుతుందన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నది అన్నారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి,గణేష్ గుప్తా,దూడల వెంకటేష్,మాజీ జెడ్పిటిసి నీరటీ తన్విరాజు,చౌదర్ గూడ గ్రామ సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం,ఉప సర్పంచ్ సంతపురి ప్రేమ్ రాజ్, కాచారం గ్రామ సర్పంచ్ రామ్ గోపాల్, పాలమాకుల గ్రామ సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్, డిప్యూటీ సర్పంచ్ గూడెం కుమార్ వార్డు సభ్యులు బూతులు బేగం, బుద్ధం నీరజ,సారా రాకేష్, పోచన్న సంధ్య, తుమ్మల సుమలత,గందె అజయ్ కుమార్, బదిరిపల్లి ప్రవీణ్, మల్లెల నర్సింగ్ రావు,కుమ్మరి చంద్రశేఖర్, అర్చన,సుక్క ప్రేమ్ కుమార్, శంకర్,శివరాం, ఫక్రుద్దీన్ అలీ, ప్రభాకర్ యాదవ్, దశరథ్ మేస్త్రి, గుడాల కృష్ణ, అశోక్ కుమార్, గోపాల్ నాయక్, పాశం ఆంజనేయులు,బొద్దం రమేష్,బాలరాజ్,యాదయ్య,మనోజ్ పటేల్,హైమద్ అలీ,మల్లికార్జున్, ఉత్తంకుమార్, అలోక్, మహేందర్, మల్లేష్,క్రాంతి, ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారువార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రూ.20 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..



**మహేశ్వరం,(ప్రజావినికిడి):**
మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్‌పేట్ సర్కిల్, నాదర్‌గుల్ 57వ, డివిజన్ పరిధిలోని గుర్రంగూడ ఆదిత్య నగర్ కాలనీ (ఫేస్ -3)లో రూ.20 లక్షల నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి పి.సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహేశ్వరం నియోజకవర్గంపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తూ అభివృద్ధి పనులను అడ్డుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.
అలాగే,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద ప్రతి కార్పొరేషన్‌కు రూ.50 కోట్ల నిధులు, మున్సిపాలిటీలకు 25 కోట్ల చొప్పున కేటాయించి,సీసీ రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు.అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే అట్టి నిధులు నిలిపివేశారని ప్రస్తుతం ఆ నిధులను విడుదల చేయకుండా నిలిపివేయడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.
మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవడం మానుకుని, ఆనాడు మంజూరైన స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి, పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు,డ్రైనేజీ, మంచినీటి సరఫరా తదితర అభివృద్ధి పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుర్రం సాయికిరణ్ రెడ్డి,ముత్యం రెడ్డి, రామిడి రామిరెడ్డి, సత్తిరెడ్డి పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు , కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రాల చెరువు పరిరక్షణకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..





**మహేశ్వరం,(ప్రజావినికిడి):**
మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్‌పేట్ సర్కిల్,మీర్‌పేట్ డివిజన్ పరిధిలోని మంత్రాల చెరువులో విస్తారంగా పేరుకుపోయిన గుర్రపు డెక్క (వాటర్ హైసింథ్) కారణంగా దుర్వాసన వెదజల్లుతూ స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, చెరువులో గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి పి.సబితా ఇంద్రారెడ్డి శ్రీకారం చుట్టారు.
ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, చెరువులో గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించి, భవిష్యత్తులో మురికి నీరు చెరువులోకి చేరకుండా అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువుల పరిరక్షణ ప్రజారోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు.అలాగే ఆమె మాట్లాడుతూ,
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో కోట్ల రూపాయలతో అందంగా అభివృద్ధి చేసిన చెరువులు నేడు ప్రభుత్వ నిర్లక్ష్యంతో మురికికూపాలుగా మారుతున్నాయి. కేసీఆర్ పేరు చెరిపివేయాలనే ప్రయత్నాలు ఎంత చేసినా,ఆయన చేసిన అభివృద్ధిని ప్రజలు ఎప్పటికీ మరవరు.కేసీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. అని అన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అర్కల భూపాల్ రెడ్డి,దీప్లాల్ చౌహాన్,అనిల్ యాదవ్,అర్కల కామేష్ రెడ్డి, దిండు భూపేష్ గౌడ్,రాజ్ కుమార్,మదారి రమేష్,శీను నాయక్,గోపి యాదవ్,ప్రభాకర్ రెడ్డి,అవినాష్,వీర రాఘవరెడ్డి, సునీత బాలరాజ్, పంతంగి మాధవి, బిందు,నిర్మలారెడ్డి తదితరులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గంజాయి సాగుచేసే వారిపట్ల కఠిన చర్యలు

## తీవ్రవాదులుగా గుర్తించ చర్యలు తీసుకుంటాం -తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరిక



**భద్రాద్రి కొత్తగూడెం,(ప్రజావినికిడి):** రాష్ట్రంలో గంజాయి రవాణాను అరికట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇప్పటికే దాడులు చేపట్టి పెద్ద ఎత్తున అరికట్టే చర్యలు చేపట్టామని అన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి పోలీస్ అధికారి డ్రగ్స్‌పై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గంజాయి సాగును చేసే వారిని తీవ్రవాదుల కంటే ఎక్కువగా పరిగణిస్తామని హెచ్చరించారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని ఈ సందర్భంగా
పోలీసులకు ఆయన సూచించారు. ప్రజలకు ఆటంకం కలగకుండా శాంతి భద్రతలు కాపాడాలని పోలీసులకు తెలంగాణ డీజీపీ స్పష్టం చేశారు. ఏఐ టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసులకు వివరించారు. యువత డ్రగ్స్‌కి అలవాటు కాకుండా ఉండేందుకు కఠినమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మావోయిస్టులను పూర్తిగా అదుపు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం కొత్తగా మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్స్, రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలని పోలీసులకు స్పష్టం చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## స్వయంగా దరఖాస్తులు పూర్తి చేసిన మాజీ సర్పంచ్ ముత్తినేని



**అనంతగిరి జులై 6:((ప్రజావినికిడి):** రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొనసాగుతున్న ఎస్ఐఆర్ (ఓటరు జాబితా సవరణ) ప్రక్రియలో అమీనాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు ఆదర్శప్రాయంగా వ్యవహరించారు. సోమవారం గ్రామంలో అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకూడదనే లక్ష్యంతో, స్వచ్ఛందంగా ఓటర్ల వద్దకే వెళ్లి వారి వివరాలను పరిశీలించారు. ఓటరు దరఖాస్తుల్లో ఉన్న స్పెల్లింగ్ పొరపాట్లు, వివరాల లోపాలు, ఇతర సాంకేతిక తప్పులను సరిచేసి దరఖాస్తులను పూర్తి చేయడంలో సహకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గ్రామ ప్రజలు కూడా మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు చేపట్టిన ఈ స్వచ్ఛంద సేవను అభినందిస్తూ, ఓటరు జాబితా సవరణలో ఆయన చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ ప్రశంసనీయమని పేర్కొన్నారు.

## రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న విద్యార్థుల స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి



**నల్గొండ జూలై 6(ప్రజావినికిడి:** )రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న విద్యార్థుల స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ స్టూడెంట్ ఎడ్యుకేషన్ ఫోరం మరియు దళిత యువజన విద్యార్థి సమైక్య సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు ఈ సందర్భంగా స్టూడెంట్ ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు గూడపూరి సంజయ్ గారుమాట్లాడుతు రాష్ట్రంలో ఫీజు రియంబర్స్ స్కాలర్ షిప్ లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు , విద్యార్థులకు గతంలో అమలులో ఉన్న విధంగా ఫీజు రియంబర్స్ మెంట్ పథకాన్ని కొనసాగించాలని, పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఎఫ్ జిల్లా ప్రెసిడెంట్ పుల్లెంల సందీప్, విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు చెడుబుద్ధి రమేష్, జిల్లా కన్వీనర్ కొండ మహేష్, సీనియర్ నాయకులు పేరపాక నరేష్, జిల్లా విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు.. లక్ష ఉద్యోగాలు

### ఎపి లక్ష్యం ఇదేనని వెల్లడించిన మంత్రి లోకేశ్



**అమరావతి,జులై 6:(ప్రజావినికిడి):** ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. సోమవారం దక్షిణ కొరియాలో సియోల్ బిజినెస్ ఏజెన్సీ కొరియన్ స్టార్టప్ ఫౌండర్లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొని మాట్లాడారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లోకి కొరియన్ స్టార్టప్‌లకు ఆహ్వానం పలికారు. భారతదేశ ఏఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని చెప్పుకొచ్చారు. అమరావతి కేంద్రంగా ఆర్టీఐహెచ్.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, అనంతపురంలో ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. ఇప్పటికే 2,500కు పైగా స్టార్టప్‌లకు ఆర్టీఐహెచ్ మద్దతు ఇచ్చిందని వివరించారు. 5,200 మందికి పైగా వ్యవస్థాపకులకు ఇన్నోవేషన్ హబ్ భాగస్వామ్యం కల్పించిందని వెల్లడించారు. స్టార్టప్‌లకు సీడ్ ఫండ్, డీప్ టెక్ గ్రాంట్లు, పెట్టుబడి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. భాగస్వామ్యంతో డీప్ టెక్ ఏంజెల్ ఫండ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇండియా-కొరియా స్టార్టప్ కారిడార్ ఏర్పాటుకు కలిసి పనిచేద్దామని మంత్రి లోకేశ్ సూచించారు. కొరియన్ కంపెనీల కోసం ప్రత్యేక 'కొరియా డెస్క్' ఏర్పాటుకు ప్రతిపాదన చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టార్టప్‌లకు కొరియా మార్కెట్.. కొరియా స్టార్టప్‌లకు భారత్ మార్కెట్ ఉంటుందని చెప్పుకొచ్చారు. లాజిస్టిక్స్, ఫిన్‌టెక్, డీప్‌టెక్, అడ్వాన్స్‌డ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌లో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. అమరావతిలో దేశ తొలి క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీలో 133 క్యూబిట్ ఎ:ఓ క్వాంటం సిస్టమ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌తో స్టార్టప్‌లకు భారీ కంప్యూటింగ్ సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

# కాళేశ్వరంను కూలేశ్వరం చేసింది ఎవరు?

### లక్ష కోట్లు పెట్టి ప్రజల సొమ్ము దుబారా చేశారు -కాళేశ్వరంపై కెటిఆర్ డ్రామాలు కట్టిపెడితే మంచిది

### బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క



**మహబూబాబాద్,జులై 6(ప్రజావినికిడి):** కాళేశ్వరం పేరుతో కెటిఆర్ డ్రామాలు చేస్తున్నారని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ తీరుపై పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మహబూబాబాద్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌కు అధికార దాహమే తప్ప... ప్రజలపై ప్రేమ లేదని విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టింది.. కూలిపోయింది బీఆర్ఎస్ హయాంలోనే అని ప్రస్తావించారు. కాళేశ్వరం పేరుతో లక్షన్నర కోట్లను వృథా చేశారని ఆరోపించారు. మళ్లీ అధికారం కావాలంటున్నారని.. ఆ ప్రాజెక్టులో నీటిని నిల్వచేస్తే పరివాహక గ్రామాలన్నీ కొట్టుకుపోవాలని కేటీఆర్ చూస్తున్నారా.. అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకుంటే అది నాశనమని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకుల లాభం కోసం కాళేశ్వరం కట్టారు తప్ప.. తెలంగాణ ప్రజల కోసం కాదని చెప్పుకొచ్చారు. కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు ఇచ్చారని మంత్రి తెలిపారు. ఆ ప్రాజెక్టులు అన్ని అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది వాళ్ల హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు దగ్గరకు పోయి ప్రాణహిత పంపు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగించలేక పోతున్నామని అన్నారు. నాసిరక నిర్మాణం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగించలేక పోతున్నామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉందని అధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం ఇలానే కొనసాగిస్తే ప్రమాదమని అంతర్జాతీయ, జాతీయ నీటి నిపుణులు నివేదిక ఇచ్చారని అన్నారు. కేటీఆర్ కన్నా ఎన్డీఎస్ఏ అధికారులకు నాలెడ్జ్ ఎక్కువగా ఉందని తాను అనుకుంటున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు స్టోరేజ్ చేసినప్పుడు కూలిపోతే కింద ఉన్న 40 ఊర్లు, భద్రాచలం కొట్టుకుపోతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కమిషన్లకు కక్కుర్తి పడి తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టకుండా తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. లేకపోతే ఎప్పుడో ఉత్తర తెలంగాణ సస్యశామలం అయ్యేదని వివరించారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది కాక ఇప్పుడు ఎదురుదాడి విమర్శలు చేయడంపై మంత్రుఇ సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఐఐటి ఖరగ్‌పూర్‌లో తెలంగాణ విద్యార్థి ప్రతిభ

**ఖరగ్‌పూర్,జూలై4(ప్రజావినికిడి):** ఐఐటీ ఖరగ్‌పూర్ 72వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. తెలంగాణకు చెందిన కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థి కంచర్ల ప్రణవ్ రెండు బంగారు, ఒక వెండి పతకం సాధించాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సహాయ మంత్రి ముజుందార్, ఆచార్య నిచోలాస్ బి.డ్రిర్క్స్, విశిష్ట అతిథిగా రాష్ట్ర మంత్రి దిలీప్ ఘోష్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 3936 మంది విద్యార్థులకు పట్టాలు అందజేశారు.

----------

## ట్రిపుల్ ఐటి విద్యార్థి ఆత్మహత్య




**హైదరాబాద్,జూలై4(ప్రజావినికిడి):** గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలో అభిరూప్ (20) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరో అంతస్తు నుంచి కిందికి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బయ్యారం గ్రామానికి చెందిన అభిరూప్ ట్రిపుల్ ఐటీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఓ వైపు చదువు ఒత్తిడి, మరోవైపు అనారోగ్య సమస్యలు ఎక్కువ కావడంతో.. తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఆరో అంతస్తు నుంచి దూకడంతో తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి వారు చెబుతున్నారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

--------------

## పిచ్చికుక్క దాడిలో 40మందికి గాయాలు

**అనంతపురం,జూలై4(ప్రజావినికిడి):** రాయదుర్గం పట్టణంలో ఓ పిచ్చికుక్క బీభత్సం సృష్టించింది. శాంతినగర్‌తో పాటు బళ్లారి రోడ్డు, ఓబులాచారి రోడ్డు పరిసర ప్రాంతాల్లో స్వైరవిహారం చేసిన పిచ్చికుక్క దారిన వెళ్లిన వారిపై విచక్షణారహితంగా దాడి చేసింది. ఈ ఘటనలో సుమారు 40 మంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. కుక్క దాడి చేయడంతో ప్రజలు భయాందోళనకు గురై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. స్థానికులు అప్రమత్తమై గాయపడిన వారిని వెంటనే రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పిచ్చికుక్క దాడితో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళన నెలకొంది. చిన్నారులు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా భయపడుతున్న పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన నేపథ్యంలో పిచ్చి కుక్కల నివారణలో మున్సిపల్ అధికారుల వైఫల్యంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కనకదుర్గమ్మకు భారీగా ఆదాయం

### హుండీ లెక్కింపులో రూ.3 కోట్లపైగా నగదు రాక

**విజయవాడ,జూలై6(ప్రజావినికిడి):** విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయం భారీగా వచ్చింది. హుండీల ద్వారా రూ.3 కోట్ల 39 లక్షల 53 వేల 599లు ఆదాయం సమకూరింది. అలాగే 568 గ్రాముల బంగారం, 3 కిలోల 330 గ్రాముల వెండితో పాటు వివిధ దేశాలకు చెందిన విదేశీ కరెన్సీని కూడా భక్తులు సమర్పించారు. 16 రోజుల హుండీ లెక్కింపును పరిశీలిస్తే రోజుకు సగటున రూ.21 లక్షల 23 వేల మేర అమ్మవారి హుండీ ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అమ్మవారి హుండీలను సోమవారం లెక్కించారు. ఈ కార్యక్రమం ఆలయ ఈవో శీనూ నాయక్ పర్యవేక్షణలో నిర్వహించారు. మొత్తం 16 రోజులకు సంబంధించిన హుండీలను లెక్కించగా భక్తులు సమర్పించిన విరాళాల ద్వారా భారీ ఆదాయం లభించింది. భక్తుల నుంచి వస్తున్న విరాళాలు కనకదుర్గమ్మపై ఉన్న అపారమైన విశ్వాసాన్ని చూపుతుందని పేర్కొన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పారదర్శకంగా పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. నగదు, బంగారం, వెండి రూపంలో భక్తులు సమర్పించిన కానుకలు ఆలయ అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు వినియోగించనున్నట్లు సమాచారం. కనకదుర్గమ్మ దర్శనానికి రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో ఆలయ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతోంది. తాజాగా హుండీ లెక్కింపులో నమోదైన రూ.3.39 కోట్ల ఆదాయం ఆలయానికి భక్తుల నుంచి లభిస్తున్న విశేష ఆదరణకు నిదర్శనంగా నిలిచింది.

## ఖమ్మంలో అధ్వాన్నంగా పారిశుద్యం

### మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం,జూలై6(ప్రజావినికిడి):** పారిశుద్ధ్య నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే సమగ్ర ప్రణాళిక రూపొందించి పారిశుద్ధ్య సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఖమ్మం జిల్లాను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. పారిశుద్ధ్యం లోపించడం అపరిశుభ్రత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిచోటా చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

## కారేపల్లిలో ఘనంగా పెద్దమ్మతల్లి బ్రహ్మోత్సవాలు

**ఖమ్మం,జూలై6(ప్రజావినికిడి):** కారేపల్లిలోని పురాతన దేవాలయమై శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల రెండో రోజు ఆలయంలో అర్చకులు ముక్కామాల మల్లిఖార్జున శర్మ, సురేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకములు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులతో కుంకుమ పూజలు, గణపతి, మృత్యుంజయ నవగ్రహ శాంతి పూజలు జరిపించారు. అనంతరం ఆలయం కమిటీ అధ్వర్యంలో మహాఅన్నదాన కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్ (టోనీ), మాజీ వైస్ ఎంపీపీ దంపతులు ఇమ్మడి రమాదేవి-తిరుపతిరావు ప్రారంభించారు.

-----------

## బాలిక కిడ్నాప్ కేసులో నలుగురిపై పోక్సో కేసు

**ఖమ్మం,జూలై6(ప్రజావినికిడి):** కారేపల్లి మండల కేంద్రంలో గల ఓ ప్రభుత్వ గురుకుల కళాశాల నుండి ఇంటర్ చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసిన నలుగురు వ్యక్తులపై కిడ్నాప్, పోక్సో కేసు నమోదు కాగా నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు కారేపల్లి పోలీసులు సోమవారం తెలిపారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దుర్గాభవాని ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం పట్టణంలోని టేకులపల్లి ప్రాంతంలో నివాసముంటూ నిందితుడికి సహకరించిన మరో ముగ్గురు మహిళలను కూడా ఈ కేసులో అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

# పశ్చిమాసియలో దారికొస్తున్న పరిస్థితి


## చమురు ఉత్పత్తి పెంచాలని ఒపెక్ ప్లస్ దేశాల నిర్ణయం



**న్యూఢిల్లీ,జూలై6(ప్రజావినికిడి):** పశ్చిమాసియాలో ఉద్రిక్తత తగ్గిన నేపథ్యంలో ముడి చమురు ఉత్పత్తి పెంచాలని ఒపెక్ ప్లస్ కూటమికి చెందిన 7 దేశాలు నిర్ణయం తీసుకున్నాయి. ఒపెక్ ప్లస్‌కు చెందిన సౌదీ అరేబియా, రష్యా, ఇరాక్, కువైట్, కజక్‌స్థాన్, అల్జీరియా, ఒమన్ దేశాలు ఆగస్టు నుంచి రోజుకు 1,88,000 బారెళ్ల అదనపు ఆయిల్ ఉత్పత్తి చేయడానికి అంగీకరించాయి. ఒపెక్ కూటమి నెలవారీ ఆయిల్ ఉత్పత్తిని పెంచడం ఇది వరుసగా ఐదవసారి. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలను స్థిరంగా ఉంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయిల్ ఉత్పత్తిని పెంచడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లో చమురు కొరత లేకుండా చూస్తూనే.. ధరలు మరీ పడిపోకుండా సమతుల్యతను కాపాడాలని ఒపెక్ భావిస్తోంది. గ్లోబల్ మార్కెట్లో చమురు ధరల్లో వచ్చే మార్పులు ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు, ద్రవ్యోల్బణంపై నేరుగా ప్రభావం చూపుతాయి. గత మార్చి నెలలో బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 120 డాలర్ల వరకు చేరింది. ఇప్పుడు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడంతో ధరలు మళ్లీ పాత స్థితికి చేరుకున్నాయి. ప్రస్తుతం బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఒపెక్ ప్లస్ దేశాల అదనపు ఆయిల్ ఉత్పత్తి వల్ల భారత్ లాంటి చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడే దేశాలకు కొంత ఉపశమనం లభించనుంది. దేశంలో చమురు ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది.

# బెంగాల్లో మూడు రాజ్యసభ స్థానాలకు నోటి ఫికేషన్

## 24న ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల



**కోల్‌కతా,జూలై6(ప్రజావినికిడి):** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల రాజీనామాలతో మూడు రాజ్యసభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డ సంగతి తెలిసిందే. ఎంపీలు సుఖేందు శేఖర్ రాయ్, సుస్మితా దేవ్, ప్రకాష్ చిక్ బారైక్ రాజీనామాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. భారత ఎన్నికల సంఘం ఈ మూడు రాజ్యసభ స్థానాలకు సంబంధించి ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. జులై 24వ తేదీన మూడు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. జూలై 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. నామినేషన్ల సమర్పణకు జూలై 14 ఆఖరి తేదీ అని పేర్కొంది. ఎన్నికల సంఘం మూడు ఖాళీలను విడివిడిగా పరిగణిస్తూ ప్రత్యేకంగా నోటిఫికేషన్లు జారీ చేసి, పోలింగ్ నిర్వహించనుంది. జులై 24వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. బ్యాలెట్ పేపర్‌పై ఓటు వేయడానికి రిటర్నింగ్ అధికారి ఇచ్చే ప్రత్యేక ఊదా రంగు పెన్ను మాత్రమే వాడాలని, ఇతర పెన్నులు వాడితే ఓటు రద్దవుతుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఇక, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది. ఓట్ల లెక్కింపు పూర్తైన వెంటనే ఫలితాలు వెల్లడించనున్నారు.

# హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్,జూలై4(ప్రజావినికిడి):** కుళ్లిన ఆహార పదార్థాలు, బొద్దింకలు, చెత్తా చెదారం నిండిన కిచెన్, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, ఇలా ఒక్కటేమిటీ అన్నీ కంపే. ఇటీవలి కాలంలో తెలంగాణ రాజధాని ఘనత వహించిన హైదరాబాద్‌లో వరుస దాడుల్లో మన హోటళ్ల బండారం బయటపడింది. ఆకలితో నకనకలాడుతున్న వారంతా ఆవురావురుమని తింటున్న ఆహారపదార్థాలు కుళ్లిన, కాలం చెల్లిన పదార్థాలతో తయారు చేస్తున్నారని అధికారులు బయట పెట్టారు. ఎంతో నమ్మకంతో హోటల్‌కు వెళ్లిన వారికి ఇలాంటి తిండి పెడుతూ కోట్లు వెనకేసుకుంటున్న హోటళ్లను మూసేయాల్సిందే. వారిని వెనక ఉండి నడిపిస్తున్న రాజకీయ నాయకుల భరతం పట్టాల్సిందే.ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిని అస్సలు వదలకూడదు. ఎందుకంటే వీరి వండివారుస్తున్న తిండి వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కొత్త కొత్త జబ్బులు కొని తెచ్చుకుంటున్నారు. ఇవన్నీ గుర్తించి ఇలాంటి హోటల్ వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప హైదరాబాద్ పరువు కాపాడుకోలేం. ఇటీవల నగరరంలో వరుసగా ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి వందల కేసులు నమోదు చేశారు. ప్రఖ్యాత హోటళ్లలోనే కంపు కొట్టేలా కిచెన్‌లు ఉంటున్నాయి. కుళ్లిన మాంసాన్ని ఫ్రీజర్‌లో పెట్టి వండి మన ముఖాన పడేస్తున్నారు. ఇకపోతే మేక మాంసంలో ఎద్దుమాసం కలిపి అమ్ముతున్న వారు హోటళ్లకు కూడా దానిని సరఫరా చేస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే హైదరాబాద్ హోటళ్లు అంటేనే భయమేసేలా దారుణమైన పరిస్థితి తయారయ్యింది. కొంతకాలం పాటు ఎవకవరు కూడా హోటల్‌కు వెళ్లకుండా ఉంటే వారు దారికొచ్చేలా ఉన్నారు. ప్ర.ంలో హైదరాబాద్ అంటే ఎంతో పేరుంది. పర్యాటక రంగంలో ప్రపంచంలో మంచి స్థానం సంపాదించుకుంది. అంతర్జాతీయ పెట్టుబడులన్నీ హైదరాబాద్‌లోనే పెడుతున్నారు. ఐటి రంగంలో బాగా విస్తరించింది. అనేక అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. దీంతో దేశవిదేశీయులు అనేకమంది ర ఓజూ హైదరాబాద్ సందర్శనకు వస్తుంటారు. ఇలాంటి ప్రతిభ ఉన్న భాగ్యనగరం కాస్తా మసకబారిపోతోంది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు ఇలా కుళ్లిన, కాలం చెల్లిన ఆహార పదార్థాలను వండిపెడితే వారి ఆరోగయం ఏం కాను. మనం తినే ఆహారం పరిస్థితి దారుణంగా ఉ ఒదన్న నిజాలు దాడులతో తెలిసింది. ఇటీవలి కాలంలో వరుసగా ఆహార భద్రతా అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో వెలుగుచూసిన దృశ్యాలు చూ స్తుంటే, మనం తింటున్నది ఆహారమా లేక విషమా అనే భయం కలుగుతోంది. ఒకవైపు పర్యాటక భాగ స్వామ్యాల గురించి చర్చలు జరుపుకుంటూనే, మరోవైపు మన నగరంలోని కనీస



పరిశుభ్రతను కూడా కాపాడుకోలేక పోతున్నాం. ప్రజలు కూడా తమ పరిసరాలు కాపాడుకోవడం లేదు. నగరాన్ని చెత్తతో నింపి నరకకూపంగా మార్చేస్తున్నారు. ఇది రకమైన అభివృద్ధి అన్నది ప్రజలు ఆలోచించాలి. ట్రాఫిక్ జామ్‌లు, వరదలొస్తే నాలాలు పొండగం, రోడ్లు చెరువులను తలపించడం, ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు తలపించడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి దుర్భర పరిస్థితులు మంచిదా అన్నది ప్రజలు కూడా ఆలోచన చేయాలి. ఇది ఖచ్చితంగా మన నగరాన్ని మనమే చేజేతులా నాశనం చేసుకుంటున్నామని గుర్తించాలి. హైదరాబాద్ నగరం గ్లోబల్ వేదికగా మారుతున్న వేళ ప్రజలుగా మనమంతా ఎలా ఉండాలో తెలుసుకోవాలి. అందమైన ఆకాశ హర్మ్యాలు ఉంటే సరిపోదు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు హైదరాబాద్ అందాలను చూసి మురిసి పోవాల్సిందే. అలాగే పరిశుభ్రత కూడా ఇక్కడ ముఖ్యం. అలాగే ఇక్కడ దొరికే తిండి మంచిదనే భరోసా ఉండాలి. సామాన్యుడు కడుపు నిండా భోజనం చేసి, ఆరోగ్యంగా బయటకు వస్తాడనే భరోసా కల్పించడం పాలకుల ప్రాథమిక బాధ్యత. కానీ, నేడు పరిస్థితి దానికి విరుద్దంగా ఉంది. అధికారులు దాడులు చేసిన ప్రతిసారీ గడువు ముగిసిన నిల్వలు, కుళ్ళిన మాంసం, అపరిశుభ్రమైన వంటశాలలు, ఎలుకలు, బొద్దింకల స్వైరవిహారం దర్శనమిస్తున్నాయి. ఇదంతా ఒకేరోజులో పుట్టుకొచ్చిన సమస్యలు కావు. సంవత్సరాల తరబడి వ్యవస్థలో పెనవేసుకుపోయిన అవినీతికి, అధికారుల నిర్లక్ష్యానికి, యజమానుల కాసుల కక్కుర్తికి నిదర్శనం. అధికారులు తనిఖీలు చేసి, ఏదో నామమాత్రపు జరిమానాలు విధించి, హోటల్ యజమానిని వదిలేయడం వల్ల వస్తున్న ఉపద్రవంగా గుర్తించాలి. హోటళ్లలో అపరిశుభ్రత, కాలం చెల్లిన పదర్థాలను వాడితే కఠిన చర్యలు ఉండాలి. అవసరమైతే ఆ హోట్‌లను మూసేయాలి. జరిమానాలు విధించాఇ. హోటల్ నిర్వహణలో నిబంధనలు పాటించకపోతే, అది ప్రజారోగ్యంతో చెలగాటంగానే చూడాలి. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నేరంగా పరిగణించి, అందుకు తగ్గట్లుగా కఠిన చర్యలు తీసుకోవాలి. ఆయా హోటళ్ల యజమానులను రక్షించే రాజకీయ దగుల్బాజీలను పట్టుకోవాలి. దాడులు జరిగినప్పుడు కొన్ని రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత మళ్లీ మామూలే అనిపించడం వల్లనే ఈ వ్యాపారస్తుల్లో ఏమాత్రం భయం ఉండటం లేదు. నిజానికి, మన నగరం ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఎదగాలంటే, హోటల్ పరిశ్రమలో కఠినమైన 'ఫుడ్‌సేఫ్టీ ఆడిట్ విధానాన్నితీసుకు రావాలి. నిబంధనలు అతిక్రమించిన హోటల్ లైసెన్స్ ను శాశ్వతంగా రద్దు చేయాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటారన్న భయం కల్పించాలి. అప్పుడే మన హోటల్ వ్యవస్థ బాగుపడుతుంది. లేకుంటే ఇలాగే కుళ్లిన ఆహార పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగటం తప్పదు.

# పివోకేలో మళ్లీ నిరసనలు

**రోడ్డుపైకి వచ్చిన నిరసనకారులు**

**పాక్ దళాల కాల్పుల్లో మరొకరు మృతి**

**భారత్ సాయం కొందరి అభ్యర్థన**



**శ్రీనగర్,జూలై6(ప్రజావినికిడి):** పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ లో నిరసనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తాజా కాల్పుల్లో ఒకరు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఆందోళన కారులను అణిచివేసేందుకు పాక్ కఠినంగా వ్యవహరిస్తోంది. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే.. జులై 9న ఫైనల్ యాక్షన్‌ను ప్రారంభిస్తామని జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ పాక్ సర్కారుకు అల్టిమేటం ఇచ్చింది. తమ నిరసనల్లో భాగం కావాలని పీఓకే ప్రజలు, ప్రవాస కశ్మీరీలకు పిలుపునిచ్చింది. ఆ రోజున పీఓకేలో పర్యటించాలని ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్, ఐరాస ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా, మానవహక్కుల సంఘాలను ఆహ్వానించింది. ఆ డెడ్‌లైన్ గడువు వరకు క్షమశిక్షణతో వ్యవహరించాలని తన మద్దతుదారులను కోరింది. పాక్ ప్రభుత్వ అణచివేతలు, పౌరుల హత్యలను అంతర్జాతీయ సమాజం గమనించాలని జేఏఏసీ అభ్యర్థించింది. నిరసల్లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించింది. సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవద్దని, నిర్బంధంలో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని, 38 పాయింట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని జేఏఏసీ డిమాండ్ చేస్తోంది. ప్రజల డిమాండ్లకు తూటాలతో స్పందిస్తే.. తమకు ఇతర మార్గాలు ఉన్నాయని పాక్ ప్రభుత్వాన్ని మరోసారి హెచ్చరించింది. కాగా.. జేఏఏసీ నేత సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడినట్లు ఉన్న ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. 'మాకు భారత్ సహాయం కావాలి. ఆహారపదార్థాలు, నిత్యావసరాల కొరత ఉంది. మానవతా సాయం అందించండి' అని ఆయన కోరినట్టుగా ఆ వీడియోలో ఉండటం గమనార్హం. నిరసనలను కఠినంగా అణచివేస్తోన్న పాక్.. ఆర్థిక దిగ్బంధనాన్ని విధించిదని అందులో ఆరోపించారు. పరిస్థితులు మరింత దిగజారితే పౌరులు భారత్‌కు వచ్చేందుకు వీలుగా నియంత్రణ రేఖ వెంట సరిహద్దును తెరవాలని అమన్ ఖాన్ విజ్ఞప్తి చేశారు. గత కొన్నిరోజులుగా పీఓకేలో పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆందోళనలకు మద్దతు ఇస్తున్న జేఏఏసీని పాక్ ప్రభుత్వం ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద నిషేధించింది. ఈ కమిటీకి చెందిన 600 మంది నాయకులు, కార్యకర్తలను భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. నిరసనకారులను అణచివేయడానికి పీఓకేలోకి వెళ్తున్న నిత్యావసర సరకులు, ఆహార పదార్థాలు, అత్యవసర మందులను ప్రభుత్వం అడ్డుకుంది.

# తిరుమలకు కాలినడకన 116 ఏళ్ల వృద్ధురాలు


## విఐపి బ్రేక్ దర్శనం కల్పించిన అధికారులు




**తిరుమల,జూలై6(ప్రజావినికిడి):** శ్రీవారి దర్శనం కోసం కాలినడకన వచ్చిన 116 ఏళ్ల వృద్ధురాలు నవనీతమ్మకు టీటీడీ వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించింది. నవనీతమ్మతో పాటు ఆమె కుటుంబసభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించారు. ఈ విషయాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఎక్స్ వేదికగా వెల్లడించారు. వందేళ్లు దాటిన వృద్ధురాలు శనివారం నాడు అలిపిరి నడక మార్గంలో తిరుమలకు వచ్చారు. దీనికి సంబంధించిన వీడియోను కొంతమంది సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. అయితే ఆ వృద్ధురాలిది కర్ణాటక అని మొదట ప్రచారం జరిగింది. ఇది చూసిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వృద్ధురాలి వివరాలు తెలిస్తే టీటీడీ ఆఫీసులో సంప్రదించాలని ఎక్స్‌లో పోస్టు కోరారు. ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ సిబ్బంది ఆమె వివరాలను సేకరించారు. వృద్ధురాలిని తమిళనాడుకు చెందిన నవనీతమ్మగా గుర్తించి, టీటీడీ చైర్మన్‌కు సమాచారం అందించారు. వృద్ధురాలి వివరాలను తెలుసుకున్న బీఆర్ నాయుడు ఆమెతో పాటు కుటుంబసభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం టీటీడీ అధికారులు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించారు. రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర వేదపండితులతో వేదాశీర్వచనం చేయించి, పట్టువస్త్రం కప్పి, తీర్థప్రసాదాలు అందజేశారు. నవనీతమ్మకు నమస్కరించి ఆశీర్వాదం కూడా తీసుకున్నారు.దీనిపై బీఆర్ నాయుడు మరోసారి స్పందిస్తూ.. నవనీతమ్మను గుర్తించడంలో తమవంతు సహకారం అందించిన సోషల్‌మీడియా మిత్రులందరికీ, అలాగే టీటీడీ విజిలెన్స్ అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఒక భక్తురాలి జీవితకాల కోరిక నెరవేర్చిన ఈ సందర్భంగా తమ అందరికీ ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని కలిగించిందని పేర్కొన్నారు.

# శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

**ఘనంగా నివాళి అర్పించిన ప్రధాని మోడీ**



**న్యూఢిల్లీ,జూలై6(ప్రజావినికిడి):** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం, ప్రజాసేవ పట్ల చూపిన అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన జీవితం 'ధైర్యానికి, మాతృభూమి పట్ల అచంచలమైన నిబద్ధతకు కాలాతీత ఉదాహరణ' అని కొనియాడారు. ప్రధాని మోదీ తన బ్లాగ్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలను ప్రస్తావించారు. శ్యామా ప్రసాద్ సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ, దేశసేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారని చెప్పారు. వలస పాలన, విభజన రాజకీయాలు, సామాజిక సవాళ్ల వంటి అంశాలపై ఆయన రాజీపడకుండా పోరాడారని గుర్తు చేశారు. దేశ సమైక్యతే శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజాజీవితానికి మూల సూత్రమని ప్రధాని అన్నారు. దేశ విభజన సమయంలో పశ్చిమ బెంగాల్ భారతదేశంలోనే

కొనసాగడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అనంతరం జమ్మూ కశ్మీర్ సంపూర్ణ విలీనానికి కృషి చేస్తూ నిర్బంధంలోనే ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. మ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఏలను 2019లో తమ ప్రభుత్వం రద్దు చేసిందని, అది శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు నిజమైన నివాళి అని ప్రధాని మోదీ అభివర్ణించారు (ఎనిటతిజీ బీనితిబా). అలాగే కలకత్తా విశ్వవిద్యాలయానికి అత్యంత పిన్న వయసులో వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామా ప్రసాద్.. పరిశోధన, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. స్వతంత్ర భారత తొలి పరిశ్రమల మంత్రి అయిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, సింద్రి ఎరువుల కర్మాగారం వంటి కీలక ప్రాజెక్టులకు పునాది వేశారని ప్రధాని గుర్తు చేశారు.

# పేర్ని నానిలా పార్టీలు మారలేదు

## మంత్రి సత్యకుమార్ కౌంటర్



**అనంతపురం,జూలై6(ప్రజావినికిడి):** వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్నినానిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. పేర్ని నాని చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకుంటారంటూ వ్యాఖ్యానించారు. 'నేను పార్టీలు మారే అవకాశవాదిని కాదు.. నాని అవకాశం కోసం పార్టీలు మారుతాడు. నా రక్తంలోనే కాషాయం ఉంది. ఒక మంత్రిగా ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకోను అని హెచ్చరించారు. జగన్‌ను నేను వ్యక్తిగతంగా ఎప్పుడూ తిట్టలేదు.. ఆయన వ్యతిరేక సిద్ధాంతాలపైనే మాట్లాడుతాను. సంకీర్ణ ప్రభుత్వంలో నేను మంత్రిని' అని చెప్పుకొచ్చారు. జగన్ ఒక నిలకడ లేని మనిషి అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతి తొందర్లోనే పూర్తి అవుతుందన్నారు. రాజధానిపై జగన్ మాట్లాడటం చూస్తే అవగాహనా లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో గవర్నమెంట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కొన్ని చోట్ల మార్పు రావాల్సి ఉందని.. దానిపై కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రజల నుంచి వస్తున్న ప్రతి ఫిర్యాదుపైనా చర్యలు తీసుకుంటున్నామని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# వైభవ్ వన్డే ప్రపంచకప్ కూడా ఆడాలి

**● మాజీ క్రికెటర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్**




టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి వన్డే ప్రపంచకప్ 2027లో కూడా ఆడే అవకాశం ఇవ్వాలని మాజీ క్రికెటర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ అన్నారు. విశ్రాంతి ఇవ్వకుండా వరుసగా మ్యాచ్‌లు ఆడించాలని టీమిండియా మేనేజ్‌మెంట్‌కు సూచించారు. ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా శనివారం మాంచెస్టర్ వేదికగా జరిగిన రెండో టీ20తో వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. తద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన అతిపిన్న భారత ఆటగాడిగా వైభవ్ చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 37 ఏళ్ల రికార్డ్‌ను 15 ఏళ్ల వైభవ్ బద్దలు కొట్టాడు. అయితే తన అరంగేట్రాన్ని వైభవ్ ఘనంగా మార్చుకోలేకపోయాడు. 10 బంతుల్లో 2 సిక్స్‌లతో 14 పరుగులే చేసి స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. తాజాగా వైభవ్ సూర్యవంశీ గురించి మాట్లాడిన శివరామకృష్ణన్.. వన్డే ప్రపంచకప్‌లో ఆడించాలనే కొత్త డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చాడు. వైట్‌బాల్ క్రికెట్‌లో టీమిండియా మ్యాచ్ విన్నర్‌గా ఎదుగుతాడని జోస్యం చెప్పాడు. విఫలమైనా అతనికి వరుసగా అవకాశాలు ఇవ్వాలని, విశ్రాంతి పేరిట పక్కన పెట్టవద్దని సూచించాడు. 'వైభవ్ సూర్యవంశీని ఆడించాలని నిర్ణయించుకున్న తర్వాత.. అతనికి తగినన్న అవకాశాలు ఇస్తూనే ఉండాలి. రాబోయే 20 ఏళ్ల పాటు భారత క్రికెట్‌కు అతను ఒక పెద్ద పెట్టుబడిగా మారుతాడు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అతనికి పూర్తి మద్దతు ఇవ్వాలి. కొన్ని మ్యాచ్‌ల్లో అతను సరిగ్గా ఆడకపోయినా.. అతన్ని జట్టు నుంచి తొలగించకూడదు. అంతేకాకుండా వైభవ్‌కు విశ్రాంతి ఇవ్వాల్సిన అవసరం లేదు. బౌలర్లకు అవసరమైనంత ఫిట్‌నెస్ బ్యాటర్లకు అవసరం లేదు. అతన్ని ఏడాది పొడవునా ఆడిస్తూనే ఉండాలి. ఎక్కువ మ్యాచ్‌లు ఆడటం, బ్యాటింగ్ చేయడం వల్ల అతని మానసిక బలంతో పాటు ఏకాగ్రత పెరుగుతుంది. వైభవ్ సూర్యవంశీ టీ20 ఫార్మాట్‌లో బాగా రాణిస్తే.. అతనికి 50 ఓవర్ల ప్రపంచకప్‌లో కూడా తప్పకుండా అవకాశం ఇవ్వాలి. అతను వైట్‌బాల్ క్రికెట్‌లో భారత ప్రధాన మ్యాచ్ విన్నర్‌గా ఎదుగుతాడు.'అని శివరామకృష్ణన్ జోస్యం చెప్పాడు.

# అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు నేమార్ రిటైర్మెంట్

న్యూజెర్సీ వేదికగా జరిగిన ఫిఫా వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 16 పోరులో నార్వే చేతిలో బ్రెజిల్ 2-1 తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ దారుణ ఓటమి తర్వాత బ్రెజిల్ స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు నేమార్ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. మ్యాచ్ ముగిసిన వెంటనే 34 ఏళ్ల నేమార్ భావోద్వేగానికి గురవుతూ.. తన 16 ఏళ్ల సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు వెల్లడించాడు. 'సెలెకావో' (బ్రెజిల్ జట్టు)తో తన ప్రయాణం ముగిసిందని స్పష్టం చేశాడు. ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌లో నార్వే ఆటగాడు ఎర్లింగ్ హాలాండ్ చివరి నిమిషాల్లో వరుసగా రెండు గోల్స్ చేసి బ్రెజిల్‌కు గట్టి షాక్ ఇచ్చాడు. స్టాపేజ్ టైమ్‌లో నేమార్ పెనాల్టీని గోల్‌గా మలిచినప్పటికీ బ్రెజిల్‌కు ఓటమి తప్పలేదు. మ్యాచ్ అనంతరం నేమార్ మాట్లాడుతూ.. "నేను ఎంతో ప్రయత్నించాను, కానీ ఇక అంతా ముగిసింది. నేను ఇక్కడే ప్రారంభించాను, ఇక్కడే ముగించాను" అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. గాయంతోనే వరల్డ్ కప్‌కు వచ్చిన నేమార్.. ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఆ తర్వాత కోచ్ కార్లో అన్సెలొట్టి వ్యూహాల్లో భాగంగా స్కాలాండ్, నార్వే మ్యాచ్‌లలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి వచ్చాడు. బ్రెజిల్ జెర్సీలో పెనాల్టీ రూపంలో అతడు చేసిన చివరి గోల్ కేవలం ఓదార్పుగానే మిగిలిపోయింది. ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన బ్రెజిల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. 2010లో సీనియర్ జట్టు తరఫున అరంగేట్రం చేసిన నేమార్.. బ్రెజిల్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. మొత్తం 129 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 80 గోల్స్ సాధించాడు. నాలుగు ఫిఫా వరల్డ్ కప్‌లలో బ్రెజిల్ ఫుట్‌బాల్‌కు ఫేస్ ఐకాన్‌గా నిలిచినప్పటికీ, ప్రపంచకప్ ట్రోఫీని మాత్రం అందుకోలేకపోయాడు. అయితే, 2013లో ఫిఫా కాన్ఫెడరేషన్స్ కప్, 2016 రియో ఒలింపిక్స్‌లో కెప్టెన్‌గా బ్రెజిల్‌కు బంగారు పతకం, 2012 లండన్ ఒలింపిక్స్‌లో రజతం అందించాడు. కెరీర్ అంతటా గాయాలు వేధించినా, అంచనాల భారం వెంటాడినా బ్రెజిల్ అత్యుత్తమ ఫుట్‌బాలర్లలో ఒకడిగా నేమార్ నిలిచిపోతాడు. మ్యాచ్ ముగిశాక మైదానంలో నేమార్ కన్నీళ్లు పెట్టుకోగా.. సహచర ఆటగాళ్లు అతడిని ఓదార్చారు. ఈ ఓటమితో కోచ్ కార్లో అన్సెలొట్టి ఆధ్వర్యంలోని బ్రెజిల్ వరల్డ్ కప్ ప్రస్థానం కూడా ముగిసింది.



# శ్రేయస్ అయ్యర్ పేరిట చెత్త రికార్డు

ఇండియా నయా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీ కెరీర్ అత్యంత వరస్ట్ నోట్ తో స్టార్ట్ అయింది. అతని లీడర్‌షిప్ లో ఆడిన ఫస్ట్ మ్యాచ్ లో ఇండియా 34 రన్స్ తేడాతో ఐర్లాండ్ చేతిలో ఓడిపోయింది. అది ఏదో ఒక మ్యాచ్ లో జరిగిన పొరపాటు అనుకుంటే, రెండో మ్యాచ్ లోనూ ఐర్లాండ్ ఒక్క రన్ తేడాతో ఇండియాను ఓడించి అయ్యర్ సేనను 2-0 తో క్లీన్ స్వీప్ చేసి హిస్టారికల్ షాక్ ఇచ్చింది. ఆ తర్వాత ఇంగ్లాండ్‌తో జరగాల్సిన ఫస్ట్ టీ20 మ్యాచ్ వర్షం వల్ల కంప్లీట్‌గా వాషౌట్ అయింది. శనివారం జరిగిన సెండ్ టీ20 మ్యాచ్ లోనైనా ఫస్ట్ విక్టరీ కొట్టాలని అయ్యర్ చూసినప్పటికీ ఇంగ్లాండ్ 4 వికెట్ల తేడాతో ఇండియాను దారుణంగా దెబ్బకొట్టింది. ఈ ఓటమితో అయ్యర్ పేరిట ఒక అన్‌వాంటెడ్ వరస్ట్ రికార్డ్ నమోదైంది. ఇండియా తరఫున మూడు కంప్లీట్ మ్యాచులకు కెప్టెన్సీ చేసి ఒక్కటంటే ఒక్క మ్యాచ్ లోనూ విక్టరీ సాధించలేకపోయిన ఫస్ట్ ఇండియన్ కెప్టెన్ గా అయ్యర్ హిస్టరీ క్రియేట్ చేశాడు. ఈ మ్యాచ్ 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ మచ్-హైప్డ్ ఇంటర్నేషనల్ డెబ్యూతో ఎంతో గ్రాండ్ గా స్టార్ట్ అయింది. కానీ లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ తన వరస్ట్ బౌలింగ్ తో పండగ వాతావరణాన్ని కంప్లీట్‌గా పాడుచేశాడు. మ్యాచ్ లో బిష్ణోయ్ వేసిన 17వ ఓవర్ లో ఏకంగా 29 రన్స్ సమర్పించుకుని మ్యాచ్ ను ఇంగ్లాండ్ చేతుల్లో పెట్టాడు. ఆ ఓవర్ ఫస్ట్ రెండు బంతులనూ బిష్ణోయ్ నో బాల్స్ వేసి భారీ బ్లండర్ చేశాడు. టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ ఓటమికి పగ తీర్చుకోవాలని చూస్తున్న ఇంగ్లాండ్ 22 ఏళ్ల యంగ్ ఆల్‌రౌండర్ జాకబ్ బెథెల్ (46 బంతుల్లో 76 నాటౌట్) ఈ లక్కీ ఛాన్స్ ను పక్కాగా యూజ్ చేసుకుని మూడు భారీ సిక్సర్లు బాదాడు. దీంతో 191 రన్స్ ఛేజింగ్‌ను ఇంగ్లాండ్ మరో ఓవర్ మిగిలి ఉండగానే చాలా ఈజీగా ఫినిష్ చేసి సిరీస్ లో 1-0 లీడ్ సాధించింది. నిజానికి ఇంగ్లాండ్ ఛేజింగ్ చాలా దారుణంగా స్టార్ట్ అయింది. ఇండియా స్పీడ్‌స్టర్ అర్ష్‌దీప్ సింగ్ ఫస్ట్ ఓవర్ లోనే ఓపెనర్లు ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్ లను అవుట్ చేసి ఇండియాకు అదిరిపోయే బ్రేక్ త్రూ ఇచ్చాడు. కానీ ఆ ఆనందం ఎక్కువ సేపు నిలవలేదు. క్రీజులోకి వచ్చిన ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ కేవలం 15 బంతుల్లోనే 3 సిక్సర్లు, 2 ఫోర్లతో 39 రన్స్ చేసి అర్ష్‌దీప్ సింగ్ ఓవర్ లోనే 27 రన్స్ పిండుకుని కౌంటర్ అటాక్ స్టార్ట్ చేశాడు. అక్షర్ పటేల్ బౌలింగ్ లో బ్రూక్ లెగ్ సైడ్ లో ఇషాన్ కిషన్ కు క్యాచ్ ఇచ్చి అవుట్ అయినప్పటికీ, అప్పటికే అతను ఇంగ్లాండ్ విక్టరీకి కావలసిన సాలిడ్ ఫౌండేషన్ (పునాది) సెట్ చేశాడు. ఆ తర్వాత బెథెల్ తో జాయిన్ అయిన టామ్ బాంటన్ (32 బంతుల్లో 39 రన్స్) ఫోర్త్ వికెట్ కు ఏకంగా 67 రన్స్ క్రూషియల్ పార్ట్‌నర్‌షిప్ బిల్డ్ చేశారు. ఈ ఇద్దరూ ఇండియన్ స్పిన్నర్లను చాలా ఈజీగా హ్యాండిల్ చేశారు. ఇంగ్లాండ్ స్పిన్నర్లతో పోలిస్తే ఇండియా మెయిన్ స్పిన్నర్లు రవి బిష్ణోయ్ (4 ఓవర్లలో 0/60), వరుణ్ చక్రవర్తి (4 ఓవర్లలో 1/37) లు పిచ్ నుంచి ఎలాంటి సపోర్ట్ రాబట్టలేకపోయారు. ఇంగ్లీష్ స్పిన్నర్లు బాల్ ను గాల్లో స్లోగా వేసి వికెట్లు తీస్తే, మనవాళ్లు మాత్రం ధారాళంగా రన్స్ సమర్పించుకున్నారు. ఇండియా బౌలింగ్ లో కేవలం అక్షర్ పటేల్ (4 ఓవర్లలో 1/19) ఒక్కడే ఎకనామికల్ గా బౌలింగ్ చేసి వన్ మ్యాన్ షో చూపించినా లాభం లేకపోయింది. ఇక మంగళవారం జరిగే మూడో టీ20లోనైనా గెలిచి, సిరీస్ సమం చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. లేకపోతే సిరీస్ గెలిచే అవకాశం కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు.



# ఇదే నా చివరి ప్రపంచకప్..

**● క్రిస్టియానో రొనాల్డో కీలక ప్రకటన**



పోర్చుగల్ ఫుట్‌బాల్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డో తన అంతర్జాతీయ కెరీర్‌పై ఒక కీలక ప్రకటన చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న 2026 ఫిఫా ప్రపంచకప్ టోర్నమెంటే తన కెరీర్‌లో చివరిదని ఆయన స్పష్టం చేశాడు. స్పెయిన్‌తో జరగనున్న రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌కు ముందు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తన భవిష్యత్తు ప్రణాళికలపై వస్తున్న ఊహాగానాలకు తెరదించాడు. ఈ సందర్భంగా రొనాల్డో మాట్లాడుతూ.. "ఈ ప్రపంచకప్‌ను వీలైనంత ఎక్కువగా ఆస్వాదించాలనుకుంటున్నాను. ఎందుకంటే ఇదే నా చివరి ప్రపంచకప్. అయితే, రేపటి మ్యాచే ఈ టోర్నీలో నా చివరి గేమ్ కాకూడదని ఆశిస్తున్నాను" అన్నాడు. 41 ఏళ్ల రొనాల్డోకు ఇది ఆరో ప్రపంచకప్ కావడం విశేషం. ఈ టోర్నీలో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడి మూడు గోల్స్ సాధించాడు. వీటిలో ఒకటి నాకౌట్ దశలో చేసినదే. తన సుదీర్ఘ కెరీర్‌లో ప్రపంచకప్‌లలో మొత్తం 11 గోల్స్ నమోదు చేశాడు. రిటైర్మెంట్‌పై పదేపదే ప్రశ్నలు అడగవద్దని మీడియాను కోరాడు. "నేను ఎప్పుడు రిటైర్ అవ్వాలనుకుంటే అప్పుడే అవుతాను. మీరు కోరుకున్నప్పుడు కాదు. ఈ ప్రశ్న అడగడం సమయం వృథా. నా దృష్టి మొత్తం రేపటి మ్యాచ్‌పైనే ఉంది" అని స్పష్టం చేశాడు. జట్టు పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, "జట్టుకు సహాయం చేయడానికి నేను ఎప్పుడూ నా శరీరం, ఆత్మతో కట్టుబడి ఉంటాను. నేను ఆడుతున్నానా? లేదా? అన్నది ముఖ్యం కాదు. నా పాత్ర ఎప్పుడూ కీలకమే" అని వివరించాడు. ఇది తన చివరి ప్రపంచకప్ అయినప్పటికీ, టోర్నీ గెలవాలనే లక్ష్యంతోనే పోర్చుగల్ జట్టు ఇక్కడికి వచ్చిందని రొనాల్డో ధీమా వ్యక్తం చేశాడు. "ప్రపంచకప్ గెలవగలమనే నమ్మకం లేకపోతే మేము ఇక్కడ ఉండేవాళ్లం కాదు. ఇది ఒక అందమైన అనుభవం. ప్రతీ గేమ్‌లోనూ మా ఆటను మెరుగుపరుచుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని పెద్ద జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయి. మా జట్టు చాలా ప్రశాంతంగా ఉంది, మేము బాగా శిక్షణ పొంది, మ్యాచ్‌కు సిద్ధమయ్యాం" అని అన్నాడు. మొత్తంగా ఈ ప్రపంచకప్‌తో తన ప్రస్థానానికి ముగింపు పలకనున్నప్పటికీ, జట్టును విజేతగా నిలపాలనే గట్టి పట్టుదలతో రొనాల్డో ఉన్నట్లు స్పష్టమవుతోంది.

# రీఎంట్రీ ఇవ్వనున్న సంజూ శాంసన్!



టీ20 ప్రపంచకప్ గెలిచిన జోష్‌లో ఉన్న భారత్‌కు యూకే పర్యటన తీవ్ర నిరాశను మిగిల్చింది. వరుస ఓటములతో సతమతమవుతున్న వేళ, జట్టులోకి ప్రపంచకప్ హీరో సంజూ శాంసన్‌ను తిరిగి తీసుకోవాలనే డిమాండ్ ఊపందుకుంది. భారత జట్టు 2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత ఆడిన నాలుగు మ్యాచ్‌లలో ఒక్కటంటే ఒక్కటి కూడా గెలవకపోవడం అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ చేతుల్లో టీమిండియా వరుసగా పరాజయాలు చవిచూసింది. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి చోటు కల్పించడం కోసం, ఏకంగా ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన సంజూ శాంసన్‌పై వేటు వేశారు. కేవలం మూడు ఇన్నింగ్స్‌లలో విఫలమయ్యాడనే కారణంతో భారత్‌కు మూడో ప్రపంచకప్ అందించిన స్టార్ ఆటగాడిని పక్కన పెట్టడంపై ఇప్పుడు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత భారత తుది జట్టును పరిశీలిస్తే అగ్ర వరుసలోని ఏడుగురు బ్యాటర్లలో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, శివమ్ దూబే ఇలా ఏకంగా ఆరుగురు ఎడమచేతి వాటం ఆటగాళ్లే ఉన్నారు. ఒకే శైలి కలిగిన ఆటగాళ్లు వరుసగా ఉండటం వల్ల ప్రత్యర్థి బౌలర్లకు లైన్ అండ్ లెంగ్త్ మార్చాల్సిన అవసరం లేకుండా పోతోంది. ఇది బౌలర్ల పనిని మరింత సులువు చేస్తోంది. ఈ తరుణంలో కుడిచేతి వాటం కలిగిన సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకుంటే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. మిడిల్ ఆర్డర్‌లో సమతుల్యత వస్తుంది. రెండో టీ20కి ముందు తిలక్ వర్మపై వేటు పడుతుందని భావించినప్పటికీ, అతను 11 బంతుల్లో 24 పరుగులు చేసి జట్టుకు మంచి ముగింపునిచ్చాడు. దీంతో ఇప్పుడు అందరి కళ్లు ఇషాన్ కిషన్‌పైనే పడ్డాయి. ఈ పర్యటనలో ఇషాన్ ప్రదర్శన దారుణంగా ఉంది. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌లలో కేవలం 13 పరుగులు చేసిన ఇషాన్, ఇంగ్లాండ్‌పై ఆడిన రెండు మ్యాచ్‌లలో 49 పరుగులు మాత్రమే చేశాడు. ముఖ్యంగా రెండో టీ20లో అతను 40 బంతుల్లో 49 పరుగులు చేసినప్పటికీ, అతని నెమ్మదైన బ్యాటింగ్ (122 స్ట్రైక్ రేట్) వల్ల మిడిల్ ఓవర్లలో భారత్ వెనుకబడి మ్యాచ్‌ను చేజార్చుకోవాల్సి వచ్చింది. పిచ్‌పై బంతి కాస్త స్వింగ్ అయినా, బౌన్స్ అయినా ఇషాన్ కిషన్ తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అతను అంతర్జాతీయ టీ20లలో సాధించిన 1390 పరుగులలో ఏకంగా 1100 పరుగులు భారతదేశంలోని ఫ్లాట్ పిచ్‌లపైనే వచ్చాయి. ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఐర్లాండ్ వంటి దేశాలలో అతని స్ట్రైక్ రేట్ మరియు సగటు చాలా పేలవంగా ఉంది. ప్రస్తుత యూకే పర్యటనలో మూడో స్థానంలో ఆడుతున్న ఇషాన్ నాలుగు మ్యాచ్‌లలో కలిపి కేవలం 62 పరుగులు మాత్రమే చేసి ఘోరంగా విఫలమయ్యాడు.



# తిలక్ వర్మ సరికొత్త ప్రపంచ రికార్డు

భారత క్రికెట్‌లో సరికొత్త శకం మొదలైంది. సీనియర్ల గైర్హాజరీలో యువ ఆటగాళ్లు మైదానంలో పరుగుల వరద పారిస్తూ సరికొత్త రికార్డులను తమ పేరిట లిఖించుకుంటున్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టీ20 ఇంటర్నేషనల్ సిరీస్‌లో టీమిండియా యువ సంచలనం, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుత ప్రదర్శనతో అంతర్జాతీయ క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఈ తెలుగు కుర్రాడు చెలరేగి ఆడి సరికొత్త మైలురాయిని అందుకున్నాడు. టీ20 ఇంటర్నేషనల్స్ చరిత్రలో అత్యంత తక్కువ వయస్సులోనే 1500 పరుగుల మార్కును దాటిన మొట్టమొదటి భారతీయ బ్యాటర్‌గా తిలక్ వర్మ చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో అతడు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాలను సైతం వెనక్కి నెట్టడం విశేషం. క్రికెట్ మైదానంలో రికార్డులు సృష్టించడం, అవి బద్దలవడం సహజమే అయినా.. దేశానికి చెందిన ఇద్దరు యువ తారల మధ్య జరిగిన ఈ పరుగుల పోటీ అభిమానులకు అసలైన మజాను అందించింది. ఇంగ్లాండ్ పర్యటనలో జులై 1వ తేదీన జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ తన తుఫాన్ బ్యాటింగ్‌తో అంతర్జాతీయ టీ20ల్లో 1500 పరుగులు పూర్తి చేసుకున్నాడు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# సెన్సార్ పనులు పూర్తి చేసుకున్న 'ఓ సుకుమారి'...




ఐశ్వర్య రాజేశ్, తిరువీర్ జంటగా నటించిన 'ఓ సుకుమారి' సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి U/A సర్టిఫికెట్ జారీ చేసింది. ఫాంటసీ అంశాలతో కూడిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని జులై 1న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మహేశ్వర రెడ్డి మూలి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాజకీయ నాయకుడు కావాలనుకునే ఓ యువకుడు, సుకుమారి (ఐశ్వర్య రాజేష్) అనే పల్లెటూరి అమ్మాయి ప్రేమలో పడతాడు. అయితే ఆమెను ఎవరు తాకినా షాక్ కొట్టడం అనే విచిత్రమైన సమస్య చుట్టూ కథనం హాస్యభరితంగా, ఆసక్తికరంగా సాగుతుందని తెలుస్తోంది.

ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా, ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ దశలో ఉంది. తెలుగుతో పాటు తమిళం, ఇతర భాషల్లోనూ ఒకేసారి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. U/A సర్టిఫికెట్ రావడంతో ఈ సినిమా కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందని అంచనాలు నెలకొన్నాయి.




# విజయ్ సేతుపతి వల్లే ఆ పాత్రలో మెప్పించా : ఐశ్వర్య రాజేశ్

హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్, వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో ఐశ్వర్య ఘన విజయాన్ని అందుకుంది. తిరువీర్ సరసన నటించిన 'ఓ సుకుమారి' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించిన ఈ చిత్రం జూలై 17న థియేటర్లలోకి రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్ ఇంటర్వ్యూలో ఐశ్వర్య తన కెరీర్ ఆరంభంలో ఎదురైన ఒక ఆసక్తికరమైన సాహసాన్ని గుర్తుచేసుకుంది. తనకు కేవలం 22 ఏళ్ల వయసు ఉన్నప్పుడే 'కా పే రణసింగం' (వైఫ్ ఆఫ్ రణసింగం) అనే చిత్రంలో ఇద్దరు పిల్లల తల్లిగా నటించానని ఆమె వెల్లడించింది. కెరీర్ పతనం అవుతుందేమోనన్న భయాలున్న ఆ చిన్న వయసులో, అంతటి బరువైన పాత్రను చేయడానికి హీరో విజయ్ సేతుపతి తనకు కొండంత అండగా నిలిచారని తెలిపింది.ఆ పాత్రను తాను సమర్థవంతంగా పోషించగలనని విజయ్ సేతుపతి నమ్మడమే కాకుండా, సెట్స్‌లో హావభావాలు ఎలా పండించాలో దగ్గరుండి నేర్పించారని ఐశ్వర్య చెప్పింది. విజయ్ సేతుపతి వంటి గొప్ప నటుడి ప్రోత్సాహం వల్లే ఆ పాత్రలో మెప్పించగలిగానని తెలిపింది.

# 'సత్లుజ్' వివాదం.. సినిమాలో దేశ వ్యతిరేక శక్తులు దుర్వినియోగం చేసే సన్నివేశాలు?

### జీ5 నుంచి 'సత్లుజ్' సినిమా తొలగింపు




పంజాబీ నటుడు దిల్‌జిత్ దోసాంజ్ ప్రధాన పాత్రలో నటించిన 'సత్లుజ్' చిత్రాన్ని జీ5 ఓటీటీ వేదిక నుంచి తొలగించారు. సినిమాలోని కొన్ని సన్నివేశాలను భారత్ వ్యతిరేక శక్తులు దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్న ఆందోళనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ చిత్రం తొలుత 'పంజాబ్ 95' పేరుతో రూపొందింది. థియేటర్లలో విడుదలకు అనుమతి రాకపోవడంతో ఇటీవల 'సత్లుజ్' పేరుతో జీ5లో విడుదల చేశారు. అయితే విడుదలైన మరుసటి రోజే చిత్రాన్ని తొలగించారు. సినిమాలోని కొన్ని భాగాలపై గతంలోనే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అవే అంశాలు దేశ వ్యతిరేక శక్తులకు ఉపయోగపడే ప్రమాదం ఉందని భావించినట్లు పేర్కొన్నాయి. ఈ చిత్రం పంజాబ్‌లో ఉగ్రవాదం తీవ్రంగా ఉన్న సమయంలోని పరిస్థితుల ఆధారంగా తీశారు. అప్పుడు ఎన్‌కౌంటర్లు, మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాటిని వెలుగులోకి తీసుకువచ్చిన సామాజిక కార్యకర్త జస్వంత్ సింగ్ ఖల్రా జీవితం ఆధారంగా సినిమాను తెరకెక్కించారు.

చిత్రాన్ని తొలగించిన విషయాన్ని జీ5 అధికారికంగా ధ్రువీకరించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ సినిమా భారత్‌లో అందుబాటులో ఉండదని ప్రకటించింది. అయితే చిత్ర బృందానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేసింది.

చట్టపరమైన అన్ని మార్గాలను అనుసరించి వీలైనంత త్వరగా సినిమాను మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని జీ5 వెల్లడించింది.

ఇక దిల్‌జిత్ దోసాంజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించారు. "చీకటిని నేను సవాల్ చేస్తున్నాను" అంటూ పోస్ట్ చేశారు. తర్వాత లైవ్‌లో మాట్లాడుతూ, ఒకసారి ఇంటర్నెట్‌లోకి వచ్చినది పూర్తిగా తొలగించలేరని అన్నారు. "నన్ను ఎంత ఇబ్బంది పెట్టినా పంజాబ్‌తోనే ఉంటాను" అని వ్యాఖ్యానించారు. సినిమా తొలగింపును ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ మల్విందర్ సింగ్ కాంగ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే సుఖ్‌పాల్ ఖైరా తప్పుబట్టారు. సరైన వివరణ లేకుండా సినిమాను తొలగించడం నిరాశ కలిగించిందని అన్నారు. 'సత్లుజ్' చిత్రం 2022లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)కి వెళ్లింది. అప్పట్లో 127 కట్‌లు సూచించారని చిత్ర నిర్మాతలు ఆరోపించారు. మూడు సంవత్సరాల తర్వాత ఓటీటీలో విడుదలైన ఈ చిత్రం మళ్లీ వివాదంలో చిక్కుకుంది.

# ఏనుగు దంతాల కేసు: హైకోర్టు ముందుకు మోహన్‌లాల్ ఐటీ డిక్లేరేషన్ పత్రాలు



మలయాళ సూపర్ స్టార్, పద్మభూషణ్ మోహన్‌లాల్‌ను సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ఏనుగు దంతాల అక్రమ నిల్వ కేసు కేరళ హైకోర్టులో సరికొత్త మలుపు తిరిగింది. గతంలో ఆయన ఆదాయపు పన్ను శాఖకు సమర్పించిన వాలంటరీ డిస్క్లోజర్ స్కీమ్ నివేదిక ఇప్పుడు న్యాయస్థానం ముందుకు వచ్చింది. ఆ పత్రాల ప్రకారం... మోహన్‌లాల్ వద్ద కేవలం నాలుగు మాత్రమే కాకుండా, మొత్తం 10 ఏనుగు దంతాలతో పాటు దంతాలతో చేసిన మరో 13 కళాఖండాలు (విగ్రహాలు) ఉన్నాయి. ఈ వివరాలను ఆయన స్వయంగా వెల్లడించారు. 2011 జూన్ నెలలో మోహన్‌లాల్‌కు చెందిన ఇళ్లు, ఆఫీసులపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొచ్చిలోని ఆయన సొంత నివాసంలో నాలుగు ఏనుగు దంతాలు దొరికాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టాల ప్రకారం ముందస్తు అనుమతులు లేకుండా ఇలాంటి నిషేధిత వస్తువులను దగ్గర ఉంచుకోవడం నేరం కావడంతో కేరళ అటవీ అధికారులు నాడు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారం గత పదేళ్లుగా కోర్టు పరిధిలోనే నలుగుతోంది.

మరోవైపు, మోహన్‌లాల్ ఎలాంటి చట్టవిరుద్ధ పనులకు పాల్పడలేదని ఆయన తరపు న్యాయవాదులు వాదిస్తున్నారు. ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన ప్రత్యేక 'ఐవరీ అమ్నెస్టీ' పథకం కింద ఈ సమాచారాన్ని ముందే డిక్లేర్ చేశామని కోర్టుకు వివరించారు. అయితే, ఐటీ శాఖకు వివరాలు అందజేసినప్పటికీ... అటవీ చట్టాల ప్రకారం ఈ దంతాలను కలిగి ఉండటానికి అవసరమైన అధికారిక యాజమాన్య ధ్రువీకరణ పత్రాన్ని మోహన్‌లాల్ సకాలంలో పొందారా? లేదా? అనే లీగల్ పాయింట్‌పైనే ప్రస్తుతం హైకోర్టులో ప్రధానంగా విచారణ సాగుతోంది.

# 28 ఏళ్ల గ్యాప్ తర్వాత మ్యాజిక్ కాంబో

## 'కింగ్ 100' మూవీలో టబు ఎంట్రీ!





టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున కెరీర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 100వ చిత్రం (కింగ్ 100) ఈ మూవీ గురించి వస్తున్న ఒక్కో అప్‌డేట్ అంచనాలను ఆకాశానికి తీసుకెళ్తోంది. ముఖ్యంగా నాగార్జున సరసన ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన అలనాటి అందాల తార టబు.. దాదాపు 28 ఏళ్ల సుదీర్ఘ గ్యాప్ తర్వాత మళ్లీ నాగ్ సరసన ఈ సినిమాలో కనిపించబోతోందనే వార్త టాలీవుడ్‌లో సెన్సేషన్‌గా మారింది. అయితే ఈసారి ఆమె రోల్ చాలా డిఫరెంట్‌గా ఉంటుందని టాక్. ఆ ఇంట్రెస్టింగ్ డీటెయిల్స్ ఇప్పుడు చూద్దాం.

ఊహించని రోల్‌లో కనిపించనున్న టబు: గతంలో నాగార్జున, టబు కాంబినేషన్ అనగానే ప్రేక్షకులకు వారిద్దరి మధ్య కెమిస్ట్రీ, రొమాంటిక్ సీన్స్ మూవీస్ నిన్నేపెళ్లాడట, ఆవిడా మా ఆవిడే, ఇలా ఎన్నో గుర్తొస్తాయి. అప్పట్లో వీరిద్దరికీ ఇండస్ట్రీలో ఒక ప్రత్యేకమైన అభిమాన వర్గం ఉంది. అయితే, ఈ 100వ సినిమాలో టబు హీరోయిన్‌గా కాకుండా.. నెగటివ్ షేడ్స్ ఉన్న ఒక పవర్‌ఫుల్ ప్రతినాయిక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. ఇన్నాళ్లూ వీరిని లవర్స్‌గా చూసిన ఆడియన్స్‌కు.. ఇప్పుడు నాగ్‌కు అపోజిట్‌గా టబు విలనిజం చూపించబోతోందనే బజ్ సినిమాపై క్యూరియాసిటీని రెట్టింపు చేసింది : అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున స్వయంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇండస్ట్రీ టాక్ ప్రకారం.. పేదరికం నుంచి స్వయంకృషితో ఒక పెద్ద సంపన్నుడిగా ఎదిగిన ఓ వ్యక్తి జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందట. ఇక ఇందులో తండ్రీకూతుళ్ల మధ్య సాగే ఎమోషన్స్ సినిమాకు మెయిన్ హైలెట్ అని తెలుస్తోంది. అలాగే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో సుష్మిత భట్ కూడా ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ సైలెంట్‌గా శరవేగంగా సాగుతోంది. జూలై 10 తర్వాతే అసలైన అప్‌డేట్: తాజాగా అఖిల్ అక్కినేని నటించిన 'లెనిన్' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున.. తన 100వ సినిమా గురించి ఫ్యాన్స్‌కు ఒక అదిరిపోయే హామీ ఇచ్చారు. జూలై 10 తర్వాత 'కింగ్ 100'కు సంబంధించిన అఫీషియల్ అప్‌డేట్స్ ఇస్తానని ఆయన ప్రకటించారు. ఇక దీంతో జూలై మధ్య వారం నుంచి ఈ సినిమాకు సంబంధించిన అసలైన వివరాలు, అలాగే టబు క్యారెక్టర్‌పై వస్తున్న వార్తల్లో నిజమెంత అనే విషయాలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది. బాక్సాఫీస్ దగ్గర కింగ్ మార్క్ ర్యాంపేజ్: నాగార్జున తన కెరీర్‌లో ఎన్నో మైల్ స్టోన్ సినిమాలు చేశారు. ఇప్పుడు రాబోతున్న ఈ 100వ సినిమా ఆయనకు మరింత స్పెషల్. 28 ఏళ్ల తర్వాత టబు లాంటి వెర్సటైల్ యాక్ట్రెస్ ఈ ప్రాజెక్ట్‌లోకి రావడం, అది కూడా విలన్ పాత్ర అనగానే అంచనాలు నెక్స్ట్ లెవెల్‌కు వెళ్లిపోయాయి. ఇక అధికారిక ప్రకటన వచ్చే వరకు ఇవన్నీ ఇండస్ట్రీ బజ్ అయినప్పటికీ.. ఒకవేళ ఇదే నిజమైతే మాత్రం థియేటర్లలో నాగ్, టబుల మైండ్ బ్లోయింగ్ పర్ఫార్మెన్స్‌తో బాక్సాఫీస్ దగ్గర కింగ్ మార్క్ ర్యాంపేజ్ చూడటం ఖాయం

# 'అమీర్ లోగ్' టీజర్.. ఫుల్ గా హైప్ పెంచేలా.

చిన్న సినిమాకు ప్రేక్షకుల్లో గుర్తింపు రావాలంటే కంటెంట్ తో పాటు సరైన ప్రమోషన్, రిలీజ్ కూడా చాలా ముఖ్యం. ఆ విషయంలో టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి చిన్న చిత్రాలకు తనవంతు అండగా నిలుస్తున్నారు. వైవిధ్యమైన కంటెంట్ తో తెరకెక్కిన సినిమాలను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. తాజాగా యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా రూపొందిన అమీర్ లోగ్ సినిమాకు ఆయనకు చెందిన స్పిరిట్ మీడియా అండగా నిలిచింది. ఇప్పటికే ఆ చిత్రంపై ఆసక్తి నెలకొనగా.. తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై హైప్ మరింత పెంచేలా కనిపిస్తోంది. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోస్ లో జరిగిన కార్యక్రమంలో అమీర్ లోగ్ టీజర్ ను మూవీ టీమ్ రిలీజ్ చేసింది. ప్యూర్ హైదరాబాదీ సోల్ అనే కాన్సెప్ట్ కు తగ్గట్లుగానే టీజర్ ను కట్ చేశారు. హైదరాబాద్ గల్లీలు, లోకల్ కల్చర్, అక్కడి యువత మాట్లాడుకునే స్లాంగ్ తో టీజర్ ఫన్నీగా సాగింది. ముఖ్యంగా ముగ్గురు స్నేహితుల మధ్య వచ్చే సన్నివేశాలు, కామెడీ డైలాగ్స్ యూత్ ను ఆకట్టుకునేలా ఉన్నాయి. సాధారణంగా హైదరాబాద్ బ్యాక్ డ్రాప్ తో సినిమాలు వచ్చినప్పుడు అక్కడి కల్చర్ న్యాచురల్ గా చూపించడం కీలకం. ఏమాత్రం తేడా వచ్చినా ఆర్టిఫీషియల్ గా అనిపించే అవకాశం ఉంటుంది. అయితే అమీర్ లోగ్ టీజర్ లో మాత్రం ఆ విషయంలో మూవీ టీమ్ జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపిస్తోంది. లోకల్ స్లాంగ్, గల్లీ ముచ్చట్లు, యువత మధ్య జరిగే సరదా సంభాషణలను సహజంగా చూపించే ప్రయత్నం చేశారు. సినిమాలో ఎంసీ హరి, మనోజ్, శశిధర్ లీడ్ రోల్స్ లో నటించారు. హైదరాబాద్ గల్లీల్లో తిరిగే ముగ్గురు యువకుల పాత్రల్లో వీరు సహజంగా కనిపించారు. ముఖ్యంగా వారి మధ్య కెమిస్ట్రీ, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ టీజర్ లో హైలైట్ గా నిలిచాయి. కొత్త నటీనటులే అయినప్పటికీ పాత్రలకు తగ్గట్లుగా కనిపించడం సినిమాకు ప్లస్ అయ్యే అవకాశం ఉంది. వేద జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయియోగి కీలక పాత్రల్లో నటించారు.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613